Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సాహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
The Largest Circulated Telugu Fortnightly
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు • ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 259 | హైదరాబాద్ | సోమవారం 03 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## రాహుల్‌దే బాధ్యత!

### రేవంత్ 'క్రిమినల్ వేస్ట్' వ్యాఖ్యలు దురదృష్టకరం

స్పందించకపోతే సమర్థించినట్లే

యువత ఓట్లతో గెలిచి వారినే అవమానిస్తారా?

గతంలోనూ 'బిరు, బిర్యానీ' బ్యాచ్ వ్యాఖ్యలు

ఇంజనీరింగ్ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి

రాహుల్‌గాంధీకి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 2 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంజనీ రింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అంటూ వ్యాఖ్యలు చేయడం తెలంగాణ యువతతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లను అవమానించేలా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నైతిక బాధ్యత వహిస్తూ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా భారత ఇంజనీర్లు అగ్రశ్రేణి కంపెనీలకు నాయకత్వం వహిస్తూ, అత్యాధునిక సాంకేతిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అంతరిక్షంలోకి రాకెట్లను పంపడం నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే సాంకేతిక సంస్థలను నడిపించడం వరకు భారత ఇంజనీర్లు విశేష సేవలందిస్తున్న సమయంలో వారిని 'క్రిమినల్ వేస్ట్'గా పేర్కొనడం అత్యంత దుర దృష్టకరమని మండిపడ్డారు. దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఇంజనీర్ల ను అవమానించడం కాంగ్రెస్ పార్టీ విధానమా? దీనికి రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. రేవంత్ వ్యాఖ్యలపై ఇప్పటివరకు రాహుల్‌గాంధీ స్పందించకపోవడం, క్షమాపణ చెప్పాలని ఆదేశించకపోవడం, తాను కూడా స్పందించకపోవడం సీఎం వ్యాఖ్యలను సమర్థించినట్లేనని ఆరోపించారు.

**రాహుల్.. మౌనం ఎందుకు?**

యువతే రేపటి భారతదేశ నిర్మాతలన్న విషయాన్ని రాహుల్‌గాంధీ గుర్తుంచుకోవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో యువత పోషించిన పాత్ర ను గుర్తు చేస్తూ, యువతతో పెట్టుకుంటే ఏమవుతుందో కాంగ్రెస్ పార్టీకి చరిత్రే చెబుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ సమయంలోనూ, యూపీఏ హయాంలోనూ యువత తమ శక్తిని చూపించిందని, ఆ చరిత్రను

- మిగతా 2వ పేజీలో



## పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నాం

### అమెరికాలో ఐఓసీ ప్రతినిధుల సమావేశంలో భట్టి

ఎన్ఆర్ఐలు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు

హైదరాబాద్: సంక్షేమం, అభివృద్ధిని సమాన ప్రాతిపదికన ముందుకు తీసుకెళుతూ ప్రపంచస్థాయి పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) ప్రతినిధుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ


- మిగతా 2వ పేజీలో

# నామినేటెడ్ పదేరం!

## అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్.. త్వరలో భర్తీకి కసరత్తు

వేలల్లో ఆశావహులు.. పదవుల కోసం ప్రయత్నాలు

వెంటాడుతున్న అసమ్మతి భయం.. అయినా.. తప్పని పరిస్థితి



తెలంగాణ కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం గుడ్‌న్యూస్ చెప్పింది. పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇంకా పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవులు భర్తీ చేయకపోవడంతో నిరాశలో ఉన్న నాయకుల్లో ఉత్సాహం నింపేందుకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే మంత్రివర్గ విస్తరణకు నో అన్న హైకమాండ్ నామినేటెడ్ పోస్టుల భర్తీకి మాత్రం అధిష్ఠానం పచ్చజెండా ఊపింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో నామినేటెడ్ స్థానాల పంపిణీకి కసరత్తు వేగవంతమైంది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, ఫెడరేషన్లు, సొసైటీలు, కమిటీలకు సంబంధించి వందలాది పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆశావహుల సందడి మళ్లీ మొదలైంది.

**ముగిసిన పదవీకాలం..**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలినాళ్లలో సుమారు 37 ప్రధాన కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా, వాటిలో కొన్నింటి రెండేళ్ల పదవీ కాలం ముగిసింది. జగ్గారెడ్డి సతీమణి నిర్మలా జగ్గారెడ్డి పదవీ కాలం తాజాగా ముగిసింది. వాటితో పాటు ఇప్పటివరకు భర్తీ కాని వివిధ రాష్ట్ర స్థాయి సొసైటీలు, ఫెడరేషన్లు, బోర్డులకు సంబంధించిన 50కి పైగా చైర్మన్ పోస్టులు, జిల్లాల స్థాయి మార్కెట్ కమిటీలు, టెంపుల్ ట్రస్ట్ బోర్డుల నామినేటెడ్ స్థానాలు భర్తీకి సిద్ధంగా ఉన్నాయి. పార్టీకి సుదీర్ఘకాలం వెన్నుదన్నుగా నిలిచిన సీనియర్లు, గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు త్యాగం చేసిన నేతలు, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలకు చెందిన పలువురు నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా నామినేటెడ్

- మిగతా 2వ పేజీలో



## డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలి
- యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' ప్రారంభం

న్యూఢిల్లీ: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల తాత్కాలికంగా ఉత్సాహం కలిగినప్పటికీ అవి వృత్తి, వ్యక్తిగత జీవితాలను పూర్తిగా నాశనం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలని యువతకు పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఢిల్లీలో వర్చువల్‌గా ప్రారంభించారు. యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండాలని.. ఇందుకోసం అన్ని రకాల మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండటం అవసరమని పేర్కొన్నారు. శత్రు

- మిగతా 2వ పేజీలో



## మేడిగడ్డ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోయాలి

### భారాస

రామడుగు, వెల్గటూరు, ధర్మారం: రాష్ట్రంలోని ప్రాజెక్టులను నింపడానికి మేడిగడ్డ నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు చేపట్టాలని భారాస మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయనతో పాటు ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రులు టి.జీవన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల

- మిగతా 2వ పేజీలో



## మహంకాళీ.. కాపాడాలి

### అంగరంగ వైభవంగా లష్కర్ బోనాలు

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

పూజలు చేసిన మంత్రులు, ఇతర ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: చరిత్రాత్మకమైన లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు వేలాది మంది తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి

- మిగతా 2వ పేజీలో





## హైడ్రాపై సుప్రీంకు

### హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సవాల్

సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్!.. హైడ్రా అధికారాలపై తేల్చుకోనున్న సర్కారు

చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై హైడ్రా వాదనలు?

సుప్రీం తీర్పుతో హైడ్రా అధికారాలపై స్పష్టత!

హైదరాబాద్, ఆగస్టు 2: హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలు, చెరువులు, నాలాలు, ప్రభు త్వ భూముల ఆక్రమణల తొలగింపును అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీల క న్యాయపోరాటానికి సిద్ధమవుతోంది. హైడ్రా అధికారాలపై

- మిగతా 2వ పేజీలో



## ఒకే షిఫ్ట్‌లో నీట్

### ఈ నెల 30న పరీక్ష

### దేశవ్యాప్తంగా ఒకే ప్రశ్నాపత్రం

ఎన్‌టీఈఎంఎస్‌కు నిర్వహణ బాధ్యతలు

సమయం పెంచి, ప్రశ్నల సంఖ్య తగ్గింపు

210 నిమిషాలు.. 180 ప్రశ్నలు

సమీపంలోనే పరీక్ష కేంద్రాల కేటాయింపు

బయోమెట్రిక్, ఐరిస్ వెరిఫికేషన్, కఠిన భద్రతా చర్యలు

నీట్-పీజీ 2026లో కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు

ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో పేపర్ ఎంపిక: కేంద్ర మంత్రి జేపీ నడ్డా

2వ

# నామినేటెడ్ పదేరం!

(మొదటి పేజీ తరువాయి)

పదవులు దక్కకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారికి ప్రాతినిధ్యం కల్పించే సూత్రం ఆధారంగా ఈ పదవులను కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్న నేతలు తమ గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కచ్చితంగా ఈ దఫ తమకు పదవులు ఇప్పించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

### వెంటాడుతున్న అసమ్మతి..

మంత్రివర్గ విస్తరణకు అసమ్మతి భయం వెంటాడినట్లే నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలోనూ కాంగ్రెస్ పెద్దలను నామినేటెడ్ పదవులు భయపెడుతున్నాయి. ప్రభుత్వంలో కీలకమైన నామినేటెడ్ పోస్టుల భర్తీ ఇంతకాలం ఆలస్యం కావడానికి ప్రధానంగా అసమ్మతి భయమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆశావహుల సంఖ్య వేలల్లో ఉండటం, పోస్టులు వందల్లోనే ఉండటంతో పదవులు దక్కని సీనియర్లు, కేడర్ అసంతృప్తికి గురైతే పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడే ప్రమాదం ఉంది. ఈ చిక్కుముడిని విప్పేందుకు రేవంత్ రెడ్డి కొత్త వ్యూహాలను పరిశీలిస్తున్నారు. పదవులు దక్కని నాయకులకు భవిష్యత్తులో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పెరిగే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఇస్తామని ముందస్తు హామీలు ఇవ్వడం ద్వారా అసమ్మతి చెలరేగకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### పదవుల పంపకం అగ్ని పరీక్షే..

నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ అధికార కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు కేడర్‌లో ఉత్సాహాన్ని నింపే అవకాశాన్ని, మరోవైపు అసంతృప్తులను దారికి తెచ్చుకునే పెద్ద సవాలును ఒకేసారి తెచ్చిపెట్టింది. గ్రేటర్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాల్సిన ఉంది. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న పాత నాయకులను, కొత్తగా పార్టీలో చేరిన నేతలను కవర్ చేస్తూ నేతలను ఎంపిక చేయడమే టీపీసీసీ ముందున్న ప్రధాన అగ్నిపరీక్షే అనుకోవచ్చు. కానీ, ఆలస్యం చేస్తే మరింత ప్రమాదమని గుర్తించిన అధిష్ఠానం త్వరలోనే నామినేటెడ్ పదవులను ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# మేడిగడ్డ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోయాలి

(మొదటి పేజీ తరువాయి)

వద్ద ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌ను, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంపుహౌస్‌ను, కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. గోదావరిలో దాదాపు 5 లక్షల క్యూసెక్కుల వరద వృథాగా పోతుండగా.. దీనిపై అవగాహన లేక మంత్రులు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గ్రావిటీ ద్వారా మధ్య మానేరుకు తరలిస్తున్నట్లు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి అందుబాటులోని 60 టీఎంసీల నీటిని తరలిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇవ్వగా.. అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా తట్టెడు మట్టి ఎత్తిపోయలేదని జీవన్‌రెడ్డి విమర్శించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి జలాశయం నుంచి ఏటా 240 టీఎంసీల నీటిని తరలించే వీలుంటే అప్పట్లో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎందుకు పూనుకున్నారో మంత్రులు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులు, ఎన్ఆర్ఐలకు ఆయన వివరించారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ' ఏర్పాటుతో 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు 'హైడ్రా' వ్యవస్థను తీసుకొచ్చామని వెల్లడించారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తెలంగాణ అభివృద్ధి, పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### భారాస పాలనలో ఆర్థిక విధ్వంసం

భారాస పాలనలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని ఈ సందర్భంగా భట్టి ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన భారాస పాలన కారణంగా..గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 15, 25 తేదీల వరకు కూడా జీతాలు రాని పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక క్రమశిక్షణను పాటించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టామని, ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని స్పష్టంచేశారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసన సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, కాలే యాదయ్య, దొంతి మాధవరెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఝాన్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళీ.. కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్నారు. జాతర సందర్భంగా వేకువజామున 4.05 గంటలకు నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.45 గంటలకు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనతోపాటు మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఆలయ చైర్మన్ కామేష్, ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి సీఎంకు స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు పవన్‌ఖేరా, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, నవీన్‌యాదవ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌రావు, హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా, ప్రభుత్వ సలహాదారులు వి.హన్మంతరావు, వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ ఆల ప్రియాంక, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

### బోనాలు విశ్వవ్యాప్తం చేసిన ఘనత కేసీఆర్‌దే: కేటీఆర్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే బోనాల జాతరను విశ్వవ్యాప్తం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. తల్లి ఆశీర్వాదంతోనే తెలంగాణ సాధించాం. అమ్మకు ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారు.

# డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

(మొదటి పేజీ తరువాయి)

దేశాలు తమ ఉగ్రవాద ప్రణాళికల్లో భాగంగా మాదక ద్రవ్యాల సరఫరాను ఒక ఆయుధంగా వాడుతున్నాయని ఆరోపించారు. డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడేవారు పోరాట యోధులని, సమాజం వారిని గౌరవించాలని సూచించారు.

### అవగాహన పెంచుకోవాలి..

చుట్టూ ఉన్న సమాజం తోడ్పాటు, యోగా, ధ్యానంతో మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి సులభంగా బయటపడవచ్చని మన సంస్కృతి బోధిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. 'నషా ముక్త్ యువ'కార్యక్రమం అనేది వ్యక్తి, కుటుంబం, సమాజం, అన్నింటికంటే ముఖ్యంగా దేశం పట్ల ఒక సంకల్పం అని చెప్పారు. ఈ కార్యక్రమం పేరులోనే దాని ఉద్దేశం ప్రతిబింబిస్తోందని అన్నారు. 'అభివృద్ధి చెందిన భారతదేశం'మన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇలాంటి తరుణంలో శారీరకంగా, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటూ ఆత్మవిశ్వాసంతో నిండిన యువత మనకు అవసరమని స్పష్టంచేశారు. డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిమాణాలపై అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. నేటి నుంచే దేశవ్యాప్తంగా నషా ముక్త్ యువ అభియాన్ ప్రారంభమవుతోందని, ఇది ఒక సామూహిక ఉద్యమంగా మారినప్పుడు, మాదక ద్రవ్యాల నుంచి దేశానికి విముక్తి లభిస్తుందని వివరించారు. ఈరోజు తీసుకున్న సంకల్పం రాబోయే 100 వారాల పాటు ఇదే రీతిలో కొనసాగుతుందని పేర్కొన్నారు. రాబోయే 100 ఆదివారాలు 'డ్రగ్స్ రహిత భారత్'దిశగా 100 బలమైన అడుగులు పడబోతున్నాయని వెల్లడించారు. ఒక చెడు వ్యసనం కేవలం శరీరాన్నే కాకుండా, తల్లి చిరునవ్వును దూరం చేస్తుందని, తండ్రి కలలను ఛిద్రం చేస్తుందని, సోదరి ఆశలను బలహీనపరుస్తుందని, తమ్ముడి గౌరవాన్ని హరిస్తుందని వ్యాఖ్యానించారు. తమ కళ్ల ముందే తమ పిల్లలు క్రమంగా తమను తాము కోల్పోతుండటం చూస్తూ కుటుంబ సభ్యులు ప్రతిరోజూ వేదనతోనే జీవిస్తుంటారని అన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో ప్రభుత్వం యువతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

### పిల్లల వ్యసనాలను దాచవద్దు

దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు. గతంతో పోలిస్తే అరెస్టుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. రూ.వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. సామాజికంగా పరువు ప్రతిష్టలకు భయపడి పిల్లల వ్యసనాలను దాచవద్దని, దానికి బదులుగా వారితో స్వేచ్ఛగా మాట్లాడాలని, వ్యసనం నుంచి బయటపడేందుకు నిపుణుల సహాయం లేదా వైద్య సాయం పొందాలని మోదీ సూచించారు. యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, వారు సమాజంలో సానుకూల సామాజిక మార్పుకు రాయబారులుగా మారేలా చేసేందుకు ప్రభుత్వం 'నషా ముక్త్ యువ'ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో క్రీడలు, వాకథాన్‌లు, ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు, వీధి నాటకాలు, చర్చా వేదికలు, కళల పోటీలు, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలు ఉంటాయి. నషా ముక్త్ భారత్(వ్యసన రహిత భారత్)ను నిర్మించాలన్న ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్'ను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా వెల్లడించారు.

# ఒకే షిఫ్ట్‌లో నీట్ పరీక్ష

**నీట్–పీజీ 2026లో కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు**

**ఎన్‌స్క్రిప్టెడ్ పద్ధతిలో ఎపర్ ఎంపిక: కేంద్ర మంత్రి జేపీ నడ్డా**

న్యూఢిల్లీ, ఆగస్టు2: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)ను దేశవ్యాప్తంగా ఒకే షిఫ్ట్‌లో ఒకే ప్రశ్నాపత్రంతో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) నిర్వహించనుంది. దాదాపు 340 నగరాల్లో, 1,300 కంటే ఎక్కువ కేంద్రాల్లో ఈ పరీక్ష ఈ నెల 30న నిర్వహిస్తోంది. ఈసారి సమయం పెంచి ప్రశ్నల సంఖ్య తగ్గించనున్నారు. 210 నిమిషాల్లో 180 ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే అభ్యర్థులకు దగ్గర్లోనే పరీక్ష కేంద్రాలు కేటాయించనున్నారు. బయోమెట్రిక్, ఐరిస్ వెరిఫికేషన్, కఠిన భద్రతా చర్యలను తీసుకోనున్నారు. ఆధార్ ఆధారిత ప్రామాణీకరణను పాటించనున్నారు. ప్రశ్నాపత్రం తయారీ, లీకేజీలను నిరోధించేం దుకు అనేక పొరల ఎన్‌క్రిప్షన్‌ను వినియోగిం చనున్నారు. నీట్ పరీక్షకు కొద్ది సమయం ముందే ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో పేపర్ ఎంపిక కానుంది. ఈ మేరకు నీట్–పీజీ 2026 పరీక్ష రాసే అభ్యర్థులకు భారీ ఊరట నిచ్చేలా కేంద్ర ప్రభుత్వం పలు కీలక సంస్కరణలను తీసుకొచ్చింది. ఆగస్టు 30న జరగనున్న ఈ పరీక్ష సన్నాహాలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సమీక్షించారు. అభ్యర్థులకు అనుకూలంగా, అత్యంత పారదర్శకంగా, సురక్షితంగా పరీక్ష నిర్వహించేందుకు కేంద్రం ఈ మార్పులు చేపట్టింది. గతంతో పోలిస్తే ఈసారి దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 12.5 శాతం పెరిగి, మొత్తం 2,73,183 మందికి చేరింది. పరీక్ష కేంద్రాల కేటాయింపులో ఈసారి ప్రధాన మార్పులు చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులో మూడు రాష్ట్రాల ప్రాధాన్యతలను తెలియజేయాల్సి ఉంటుంది. ఇందులో అభ్యర్థి నివాస ప్రాంతం ప్రాథమిక ఎంపికగా ఉండటం నిర్బంధం చేశారు. దీనివల్ల సొంత ఇంటికి దగ్గరలోని కేంద్రాలు లభించే అవకాశం ఉంది. ప్రయాణ ప్రణాళికలు చేసుకునేందుకు వీలుగా పరీక్షకు మూడు వారాల ముందే పరీక్షా నగరం వివరాల స్లిప్‌లను విడుదల చేయనున్నారు. దీంతోపాటు పరీక్ష విధానంలో మార్పు చేస్తూ, 210 నిమిషాల్లో 180 ప్రశ్నలకు సమాధానాలు రాసేలా కుదించారు. సమయం మారకుండా ప్రశ్నల సంఖ్య తగ్గడం వల్ల అభ్యర్థులకు ఒక్కో ప్రశ్నకు ఎక్కువ సమయం లభిస్తుంది.

### భద్రతా చర్యలను మరింత కఠినతరం

పరీక్ష సమగ్రతను కాపాడేందుకు భద్రతా చర్యలను మరింత కఠినతరం చేశారు. దరఖాస్తు సమయం నుంచి పరీక్ష కేంద్రాల వరకు ఆధార్ ఆధారిత ప్రామాణీకరణను ఉపయోగిస్తున్నారు. వేలిముద్రల గుర్తింపు విఫలమైతే ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్ ద్వారా తనిఖీ చేస్తారు. పరీక్ష కేంద్రాల ముందస్తు సీలింగ్, సీసీటీవీ నిఘా, సిగ్నల్ జామ్మర్లు, డైనమిక్ కంప్యూటర్ కేటాయింపు, ప్రత్యక్ష పర్యవేక్షణ వంటి ఏర్పాట్లు చేశారు. మొత్తం 60 వేల మందికి పైగా సిబ్బందిని ఈ విధుల్లో వినియోగిస్తున్నారు. ప్రశ్నాపత్రం తయారీ, లీకేజీలను నిరోధించేందుకు అనేక పొరల ఎన్‌క్రిప్షన్‌ను వినియోగిస్తున్నారు.

### ఎన్‌స్క్రిప్టెడ్ పద్ధతిలో పేపర్ ఎంపిక:నడ్డా

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా అభ్యర్థులను పుకార్లు నమ్మవద్దని హెచ్చరించారు. ప్రశ్నాపత్రం ముందస్తుగా లీక్ అయిందనే ప్రచారాలు పూర్తిగా అబద్ధాలని, పరీక్ష ప్రారంభమయ్యే కొద్ది సమయం ముందే ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో పేపర్ ఎంపికవుతుందని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎన్బీఈఎమ్ఎస్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరారు. ఏదైనా అక్రమాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక ఈమెయిల్ ఐడీని కూడా అందుబాటులోకి తెచ్చారు.

# రాహుల్‌దే బాధ్యత!

(మొదటి పేజీ తరువాయి)



రాహుల్‌గాంధీ గుర్తుంచుకోవాలన్నారు. ప్రజా స్వామ్యం, రాజ్యాంగం, నైతిక విలువలు, యువత గౌరవం గురించి తరచూ మాట్లాడే రాహుల్‌గాంధీ, తమ పార్టీ సీఎం యువతను అవమానిస్తే మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం సభల్లో ప్రసంగాలు చేయ డం వల్ల నాయకత్వ స్థాయి పెరగదని, తమ పార్టీ చేసిన తప్పులను సరిదిద్దుకోవ డం ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసం పొందగలరని వ్యాఖ్యానించారు. తెలంగా ణ యువత ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అదే యు వతను అవమానించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి గతంలో కూడా యూనివర్సిటీ విద్యార్థులను 'బీరు బ్యాచ్' అంటూ అవమా నించా రని కేటీఆర్ గుర్తు చేశారు. విద్యార్థుల ఉద్యమాలను తక్కువ చేసి మాట్లాడడం, ప్రశ్నించే వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందన్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ విద్యార్థులు, ఇంజనీర్లు మాత్ర మే కాకుండా అధ్యాపకులను కూడా 'క్రిమినల్ వేస్ట్' అంటూ అవమానించడం మరిం త బాధాకరమని పేర్కొన్నారు.

### విద్యార్థుల ఆత్మగౌరంపై దాడి!

దేశ ప్రగతి కోసం తమ జీవితాలను అం కితం చేస్తున్న అధ్యాపకులు, గురువులను కూడా రేవంత్‌రెడ్డి తక్కువ చేసి మాట్లాడారని కేటీఆర్ విమర్శించారు. విద్యార్థుల ఆత్మ గౌరవం, యువత ఆత్మవిశ్వాసంపై దాడి చేసేలా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. విద్యార్థులను, యువతను, ఇంజనీ ర్లను అవమానించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆరోపించారు. ఇంజినీర్లు, గురువులు 'క్రిమినల్ వేస్ట్' కాదని, యువతను హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే అసలు ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత వ్యాఖ్యలు కావని, అవి కాంగ్రెస్ పార్టీ వైఖరినే ప్రతిబింబిస్తున్నాయని ఆరోపించారు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ, ప్ర భుత్వ అధినేతగా రేవంత్ రెడ్డి ఇద్దరూ విద్యార్థులు, ఇంజనీర్లు, అధ్యాపకులకు బేషర తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశా రు. ఇప్పటికే ఎన్నికల హామీల విషయంలో కాంగ్రెస్ చేత మోసపోయిన తెలంగాణ యువత అన్నింటినీ గమనిస్తోందని కేటీఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలను యువత మరవదని, సరైన సమయంలో తగిన సమాధానం చెబుతుందని పేర్కొన్నారు.

### కాంగ్రెస్సే 'క్రిమినల్ వేస్ట్'

ఇంజినీర్లు, గురువులు క్రిమినల్ వేస్ట్ కాదు.. యువతను అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్సే అసలు సిసలైన 'క్రిమినల్ వేస్ట్' అని కేటీఆర్ విమర్శించారు. ముఖ్య మంత్రితో పాటు ఇంత దిగజారుడు సీఎం ను రాష్ట్రానికి పంపిన రాహుల్‌గాంధీ కూడా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ కు భవిష్యత్తు ఉండదన్నారు.

# హైడ్రాపై సుప్రీంకోర్టుకు..

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తీర్పు పూర్తి కాపీని న్యాయశాఖ, అడ్వకేట్ జనరల్ కార్యాలయం క్షుణ్ణంగా పరిశీలిస్తున్న ట్లు సమాచారం. తీర్పులోని చట్టపరమైన అంశాలపై సీనియర్ న్యాయ నిపు ణులతో చర్చించిన అనంతరం స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలు చేయనున్నట్లు అధికార వర్గాలు చెపుతు న్నాయి. హైడ్రా ఏర్పాటైనప్పటి నుంచి హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, నాలాలు, ప్రభుత్వ భూముల్లో నిర్మించిన భవనాలను గుర్తించి భారీ ఎత్తున కూల్చివేతలు చేపట్టింది. సామా న్యుల ఇళ్లతో పాటు రాజకీయ నాయకులు, వ్యా పారవేత్తలు, ప్రముఖులకు చెందిన నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకోవడంతో హైడ్రా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం దీనిని 'హైదరాబాద్‌ను భవిష్యత్ వరదల విపత్తుల నుంచి రక్షించే కార్యక్రమం'గా అభివర్ణిస్తే, ప్రతిపక్షాలు మాత్రం 'బుల్డోజర్ పరిపాలన'గా విమర్శించాయి. ఈ నేపథ్యంలో హైడ్రా చర్యలను సవాల్ చేస్తూ పలువురు బాధితులు హైకోర్టును ఆశ్రయిం చారు. నోటీసులు ఇవ్వకుండా, తమ వాదన వినకుండా కూల్చివేతలు చేపడుతున్నారని, హైడ్రాకు స్వతంత్రంగా అలాంటి అధికారాలు లేవని, చట్టబద్ధ ప్రక్రియలు పాటించడం లేదని పిటిషన్లలో పేర్కొన్నారు. ఈ అంశాలపై విచా రణ జరిపిన హైకోర్టు కొన్ని కీలక వ్యాఖ్య లు చేయడంతో ప్రభుత్వం ఇప్పుడు సుప్రీంకోర్టు తలుపుతట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

### 'హైడ్రా'పై ప్రభుత్వం వాదన

ప్రభుత్వం ప్రధానంగా మూడు అం శాలను సుప్రీంకోర్టు ముందుంచే అవకాశం ఉంది. హైడ్రా అనేది కొత్తగా చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేసిన సంస్థ కాదని, ఇప్పటికే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, పోలీసు




తదితర శాఖ లకు ఉన్న అధికారాలను సమన్వయం చేసే ప్రత్యేక వ్యవస్థ మాత్రమేనని ప్రభుత్వం వాదించే అవకాశం ఉంది. దీంతోపాటు చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల వల్ల ప్రతి వర్షాకాలంలో హైదరాబాద్ తీవ్ర జలమయమవు తోందని, నగర ప్రణాళిక పూర్తిగా దెబ్బతింటోందని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షిం చడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని స్పష్టం చేయనున్నట్టు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణ, ప్రజా వనరుల సంరక్షణ, నగర భద్రత వంటి అంశాలు వ్యక్తిగత ప్ర యోజనాల కంటే ముఖ్యమైనవని, అందుకే వేగవంతమైన చర్యల కోసం హైడ్రా అవసరమైందని ప్రభుత్వం వివరించే అవకాశ ముంది. హైకోర్టు తీర్పు ప్రభావం కేవలం హైడ్రాపై మాత్రమే కాదు. భవిష్యత్తులో ప్ర భుత్వం ఏర్పాటు చేసే ప్రత్యేక అమలు సం స్థల అధికారాలపై కూడా ఈ తీర్పు ప్రభా వం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ సంస్థలకు ఎంత అధికారం ఉంటుంది? ప్రజల ఆస్తి హక్కులు ఎంతవరకు రక్షించాలి?

నోటీసులు, విచారణ, అప్పీల్ వంటి సహజ న్యాయ సూత్రాలు తప్పనిసరా? వంటి ప్రశ్నలకు ఈ కేసు కేంద్ర బిందువుగా మారింది. అక్రమ నిర్మాణాలను తొలగించే అధికారంపై ఎలాంటి సందేహం లేకపోయినా, ఆ అధికారాన్ని వినియోగించే విధానం మా త్రం పూర్తిగా చట్టబద్ధంగా ఉండాలని కోర్టు లు పదేపదే చెపుతున్నాయి. అందుకే హై కోర్టు చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఎలాం టి దృక్పథాన్ని అవలంబిస్తుందన్నది దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

### రాజకీయంగానూ కీలకమే!

హైడ్రా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వ చ్చిన తర్వాత 'అక్రమ నిర్మాణాలపై రాజీ లేదు' అనే సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. అయితే ఇదే అంశంపై హైకోర్టు తీర్పు రావడం, ఇప్పుడు సుప్రీంకోర్టులో ప్రభుత్వం న్యాయపోరాటానికి సిద్ధమవడం రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. సుప్రీంకోర్టు ప్రభుత్వం వాదనల ను సమర్థిస్తే హైడ్రాకు మరింత చట్టపరమైన బలం లభించే అవకాశం ఉంది. మరోవైపు హైకోర్టు తీర్పును సమర్థిస్తే ప్రభుత్వం హై డ్రా పని విధానంలో మార్పులు చేయాల్సి రావచ్చు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక చ ట్టాన్ని తీసుకురావాల్సిన పరిస్థితి కూడా తలెత్తవచ్చని న్యాయవర్గాలు భావిస్తున్నా యి. సుప్రీంకోర్టు తీర్పు హైడ్రా భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సంస్థల అధికారాలపై ఒక న్యాయపరమైన ప్రమాణాన్ని నిర్దేశించే అవకాశం ఉంది. అలాగే ప్రభుత్వ పరిపాలనా అధికారాలు, పర్యావరణ పరిరక్షణ, పట్టణాభివృద్ధి, పౌరుల హ క్కుల మధ్య సమతుల్యత ఎలా ఉండాలనే అంశంపై కూడా ఈ తీర్పు మార్గదర్శకంగా నిలవొచ్చు. మొత్తంగా హైడ్రాపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం సాధారణ అప్పీల్ మాత్రమే కాదు. ఇది ప్రభుత్వ పరిపాలనా విధానంతో పాటు ప్రభుత్వ అధికా రాల పరిధి వంటి అనేక కీలక అంశాలపై సుప్రీంకోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్న న్యాయపోరాటంగా మారుతోంది.



## అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్‌కు ఘన స్వాగతం పలికిన మంత్రి పొన్నం ప్రభాకర్


- శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొని బోనం సమర్పించిన అమెరికా కాన్సుల్ జనరల్

**టి.శరత్ రావు బ్యూరో, కరీంనగర్ ఆగస్టు 2 (ప్రజాతీర్పు)**

సికింద్రాబాద్‌లోని చారిత్రాత్మక శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలకు మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు విచ్చేసిన అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్‌కు మంత్రి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమెరికా కాన్సుల్ జనరల్ సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ రాష్ట్ర ప్రజల భక్తి విశ్వాసాలకు, సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల విశిష్టతను, బోనం సమర్పణ అనంతరం నిర్వహించే సంప్రదాయ రంగం కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను అమెరికా కాన్సుల్ జనరల్‌కు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేసే అవకాశంగా ఈ సందర్శన నిలుస్తుందన్నారు. బోనాల ఉత్సవాల్లో అమెరికా కాన్సుల్ జనరల్ పాల్గొనడం తెలంగాణ--అమెరికా మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాకర పేరుకుపోయిన పశువుల నీటి తోట్టి...

**నిజాంసాగర్ , ఆగస్టు 02(ప్రజా తీర్పు ):**



కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నర్సింగ్ రావుపల్లి గ్రామంలో పశువుల నీటి తొట్లను పట్టించుకునేనాధుడే కరువయారు. గత కొన్ని రోజులుగా పారిశుద్ధ్యం కార్మికులు నీటి తోట్లను శుభ్రం చేయడమే మర్చిపోయారు. అసలే వర్షాకాలం కావడంతో తొట్లలో నిటితో పాటు చెత్తాచెదారం పేరుకుపోయాయి. తొట్ల చుట్టూ పాకరపేరుకుపోయి నీళ్ల నిలిరంగులో దర్శనమిస్తున్నాయి. అంతేకాదు... పాకరా పట్టిన నీళ్ల మీద ఈగలు, దోమలు వాలుతూ... మురుగు వాసన వెదజల్లుతుంది. ఈ నీటిని గ్రామంలోని పశువులు తాగినా అనేక రకాల రోగాల బారిన పడటం ఖాయం.ఈ విషయమై గ్రామ కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్ కలిసి జీపి సిబ్బందితో పశువుల నీటి తోట్లను పరిశుభ్రం చేయించి, పశు సంపదను కాపాడాలని గ్రామ పశువుల దారులు కోరుతున్నారు.

# జడ్పిహెచ్ఎస్ నెం 2 ఇంక్లైన్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య సార్ సంతాప సభ





**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 2**

రాడికల్ ఉద్యమం పురుడుపోసుకున్న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గడ్డమీద నక్సల్ బరీ నడకనేర్చిన ఈ బెల్లంపల్లి గడ్డమీద.గుండాగిరికి పెట్టింది పేరుగా రాష్ట్రస్థాయిలో గుండాయిజం చెలరేగిన ఇదే గడ్డమీద.ప్రముఖ పారిశ్రామిక ప్రాంతంగా సింగరేణికి మణిహారంగా వెలసిలిన ఈ గడ్డమీద... స్టైల్, న్యూ ఫ్యాషన్ అనే మాటకు కేరాఫ్ అడ్రస్ బెల్లంపల్లి అని రాష్ట్రమంతా చెప్పుకునే ఓ అద్భుతమైన బెల్లంపల్లి గడ్డమీద... ఒక పాఠశాలలో.. 1981 నుండి 2000 వరకు అంటే... సుమారు 20 సంవత్సరాలుగా హెడ్ మాస్టర్ గా ఒక్కరే ఉండడం ఒక అరుదైన రికార్డు... 20 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థుల ప్రేమానురాగాలు చురగొనడం మరో గొప్ప రికార్డు...తన 20 సంవత్సరాల ప్రయాణంలో రెండుసార్లు ట్రాన్స్ఫర్ అవకాశం వచ్చినా... విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు అందరూ కలిసి స్టేట్ లెవల్లో ధర్నాలు,రాస్తారోకోలు, ఉద్యమాలు చేసి ఆ హెడ్ మాస్టర్ మా పాఠశాలకు కావాలి... అతడిని ఎక్కడికి పంపించవద్దు ఇక్కడే మా పిల్లవాళ్ళకు విద్యాబుద్ధులు నేర్పించాలీ... అని పట్టుబట్టి ఇదే పాఠశాలలో కొనసాగించుకున్నారూ... అంటే ఇంతకంటే గొప్పతనం ఆ సార్ గురించి ఇంకేముంటుంది. ఈరోజు జడ్.పి.హెచ్.ఎస్ నంబర్ టు ఇంక్లైన్ పాఠశాలలో సంతాపసభలో పూర్వ విద్యార్థులను, వారి శిష్యగణాన్ని చూస్తుంటే... ఆనాటి జ్ఞాపకాల దొంతరలు కోకొల్లలుగా శిష్యులు చెప్పుకుంటుంటే ఒక సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని శిష్యులు గుర్రపుబగ్గీపై విద్యార్థులు తీసుకువెళ్లారు స్వయంగా విద్యార్థులు గుర్రపు బగ్గీని మోసారు అని చెప్పుకుంటుంటే ఒక గురువుకు ఇంతకంటే ఏం కావాలి అనిపించేది...కానీ... అంతకు రెట్టింపు విశ్వాసంతో ఈరోజు ఒక ఉపాధ్యాయుడు రిటైర్మెంట్ అయిపోయిన సుమారు 26 సంవత్సరాల తర్వాత కూడా ఆ హెడ్మాస్టర్ను గుర్తుంచుకొని కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా ఏ రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా ఏ రాజకీయ అవసరాలు కూడా లేకుండా... కేవలం గురు-శిష్య పరంపర అనే ప్రేమానురాగాలతో వేల మంది విద్యార్థులు ఒకటై ఈరోజు నంబర్ టు ఇంక్లైన్ బెల్లంపల్లి పాఠశాలలో ఆ మహనీయుని పేరు మీద సంతాప సభ ఏర్పాటు చేసి వేల మందికి అన్నదానం చేసిన శిష్యులు ఆనాటి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉదాంతాన్ని,మరిపించారు. హాట్సాఫ్ నెంబర్ టు ఇంక్లైన్ పూర్వ విద్యార్థులు జోహార్ స్వర్గీయ జి. వెంకటయ్య సార్ జోహార్ జోహార్ విద్యార్థి లోకం ఉన్నంతవరకు, బెల్లంపల్లి పట్టణం ఉన్నంతవరకు... మీ పేరు ప్రఖ్యాతలు కలకాలం నిలిచే ఉంటాయి జోహార్ జోహార్ వెంకటయ్య సార్.... జోహార్ జోహార్...



## పాలెపు కొండల్‌రావుకు ఘన సత్కారం

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 2.**

పొలాస అయ్యప్ప దేవాలయ గురుస్వామి శ్రీ పాలెపు కొండల్‌రావు ను హైదరాబాద్‌లోని హరి హర కళా భవన్ వేదికగా ఘనంగా సత్కరించారు. లలితా కళా సమాఖ్య వ్యవస్థాపకులు మహేంద్రవాది వేంకటేశ్వరరావు, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠాధిపతి శ్రీ చాముండేశ్వర స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినీ నటులు కోట శంకర్‌రావు, హాస్యబ్రహ్మ జెన్నీ, దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా పాలెపు కొండల్‌రావు కు స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణం, అభినందన పత్రం, జ్ఞాపిక అందజేసి, "అయ్యప్ప సేవా వైభవ సామ్రాట్" అనే గౌరవ బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా దేశంలోని ఏడు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 108 మంది ప్రముఖులను ప్రత్యేక బిరుదులు, సత్కారాలు, జ్ఞాపికలతో ఘనంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని సత్కార గ్రహీతలను అభినందించారు.



## మహా ధర్నాని విజయవంతం చేయండి

**లి పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ ...**

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 2.**

పెండింగ్ లో ఉన్న పి ఆర్ సి ని ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి ఉన్నారు ఆదివారం ప్రాథమిక పాఠశాల ధరూర్ మండల జగిత్యాల్ లో పనిచేస్తూ గతమాసం లో ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి యేల్లబోయిని శ్రీదేవిగారి సన్మాన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని ఇవ్వని పక్షంలో సెప్టెంబర్ ఒకటి నాడు ఇందిరా పార్క్ హైదరాబాద్ లో దాదాపు 20వేల మంది ఉపాధ్యాయులతో మహా ధర్నా చేస్తామని వారన్నారు అనంతరం శ్రీదేవి గారి సేవలను కొనియాడారు శ్రీదేవి గారిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం సురేందర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలుగురి దామోదర్ రావు మండల విద్యాధికారి చంద్రకళ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి ఉప సర్పంచ్ శ్రీనివాస్ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగా జమున పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు ఏవిఎన్ రాజు మహిళా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు జమున రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిత వసంత చందన రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి మండల బాధ్యులు విద్యాదేవి నాగరాణి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# నేటి.. సమాజంలో జర్నలిస్టు.. పాత్ర

- ప్రజలకు నిజాలను తెలియజేయాలి
- సమస్యలను వెలికి తీయాలి
- ఎలాంటి వారినైనా ప్రశ్నించగలగాలి
- ఒత్తిళ్లకు లొంగక...బెదిరింపులకు భయపడక... వృత్తి నిబద్ధత కలిగి ఉండాలి



సీనియర్ పాత్రికేయులు
**కందుకూరి యాదగిరి**
సూర్యాపేట

సమాజంలో జర్నలిస్టు పాత్ర ఎంతో బాధ్యతాయుతమైనది. ఎంతో కీలకమైంది అని ప్రస్తుతం జర్నలిజంలోకి నూతనంగా వచ్చేవాళ్ళు తెలుసుకోవాలి...ముఖ్యంగా పాతవాళ్లు ఈ సంగతిని పూర్తిగా విస్మరించి ఏదో ఉన్నాంలే.. ఏదో రాస్తున్నాం లే.. మనకెందుకు తలనొప్పి అనుకుంటున్నారు.. "కలం కత్తి కంటే గొప్పది" అనే నానుడికి నిజమైన అర్థం జర్నలిజం ద్వారా తెలుస్తుంది. ప్రజలకు నిజాలను తెలియజేయడం, అధికారులను ప్రశ్నించడం, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం జర్నలిస్టు ప్రధాన బాధ్యత.

### నాలుగో స్తంభం విలువ కాపాడాలి

అందుకే జర్నలిస్టును ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పరిగణిస్తారు. నేటి సమాజంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో...సమాచారం క్షణాల్లో ప్రపంచమంతా వ్యాపిస్తోంది.ఈ పరిస్థితుల్లో నిజమైన వార్తను ప్రజలకు వేగంగా, నిష్పాక్షికంగా అందించడం జర్నలిస్టుకు పెద్ద సవాలుగా మారిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.పెద్దలు చెప్పినట్లు 100 మంది దోషులకు శిక్ష పడ్డ పరవాలేదు.ఒక్క నిర్దోషికి అన్యాయం జరగ కూడదు అన్న మాటను గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడైనా ఎవరికైనా అన్యాయం జరుగుతుంది ,జరగబోతుంది ఇక నాకు న్యాయం చేసేది ఎవరు ? అని అనుకున్న తరుణంలో వారికి తప్పనిసరిగా జర్నలిస్టు అనేవాడు గుర్తుకు రావాలి. ప్రజలకు ధైర్యం ఇవ్వగలిగే స్థాయిలో జర్నలిస్టులు ఉండాలి

### తప్పుడు సమాచారం అరికట్టగలగాలి

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, పుకార్లు, తప్పుడు సమాచారాన్ని అరికట్టడంలో బాధ్యతాయుతమైన జర్నలిజం కీలక పాత్ర పోషిస్తోంది. పోషించాలి కూడా ప్రజలకు జర్నలిజంపై విశ్వాసం కలిగించాలి.ఏది నిజం!ఏది అబద్ధం!!అన్న సంగతి స్పష్టంగా తెలిసేలా బాధ్యతగల జర్నలిజం వ్యవహరించాలి.

### కాపి టు పేస్టు కాదు

జర్నలిస్టు కేవలం వార్తలు రాసేవాడు మాత్రమే కాదు. ప్రస్తుత సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని వార్తలను తీసుకొని కాఫీ టు పేస్ట్ చేసి పంపించడం జర్నలిజం కాదు. సమస్య ఎక్కడుంటే జర్నలిస్టు అక్కడ ఉండాలి.ప్రజల సమస్యలను పాలకుల సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే వారధి.ఆయా ప్రాంతాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి సమస్యలను, ఇంకా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి సామాజికంగా నష్టం చేసే వారికి సింహస్వప్నంలా నిలిచి వాటి పరిష్కారానికి మార్గం సుగమం చేయాల్సిన బాధ్యత చిత్తశుద్ధి గల జర్నలిజనిది.

### కార్యక్రమాల కవరేజ్ మాత్రమే జర్నలిజం కాదు

రోజువారి కార్యక్రమాల కవరేజీ మాత్రమే జర్నలిజం కాదు.తమ సమీప దూర వ్యవస్థలో ప్రజలు పడుతున్న అవస్థలు, సమస్యలు,జరుగుతున్న అవినీతి, అక్రమాలు, సామాజిక అన్యాయాలపై నిర్భయంగా ప్రశ్నిస్తూ నూటికి నూరు శాతం అవిశ్రాంత కృషి సల్పుతూ అక్షర సమరం చేయగలిగే సత్తా పెంపొందించుకోవాలి. నిత్యం ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలి. ప్రతి దినం నూతన విషయాలను తెలుసుకునే దిశగా అంతర్జాతీయ,జాతీయ, ప్రాంతీయ,సంగతులను సమాచారాలను విశేషాలను ప్రజలకు అందించే వారదులుగా కొనసాగాలి.

### దాడులకు బెదరకూడదు

ప్రస్తుత కాలంలో జర్నలిస్టులపై అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయి. అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాజకీయ బలం అధికార బలం అంగ బలం ఆర్థిక బలం చూసుకొని వారిపైన వారు చేస్తున్న అక్రమ వ్యాపార లావాదేవీల పైన జర్నలిస్టులు కథనాలు రాసినప్పుడు ఇలాంటి బెదిరింపులు చేస్తారు. అయినప్పటికీ నిజమైన జర్నలిస్టు రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లకు అదరకుండా బెదరకుండా ముందుకు కొనసాగాలి. కాకపోతే మనం రాసిన కథనాల ప్రకారంగా ఖచ్చితంగా సాక్ష్యం ఉండాలి ఎవిడెన్స్ తప్పనిసరి లేని పక్షంలో సమస్యల్లో చిక్కుకోవాల్సి ఉంటుంది తొందరపడి కాంట్రవర్షం వార్తలు రాసి ఇబ్బందులు పడొద్దు అన్ని ఆధారాలు ఉన్నప్పుడే అక్రమాల వెలికితీత కథనాలు రాయాలి.అప్పుడే ప్రజలకు జర్నలిజంపై విశ్వాసం పెరుగుతుంది.

### మంచి గుర్తింపు

నిజాయితీ, నిబద్ధత, నిష్పాక్షికతను పాటిస్తూ ప్రజలకు వాస్తవాలను అందించడం ప్రతి జర్నలిస్టు ధర్మం. అలాంటి వారిని సమాజం మంచి జర్నలిస్టుగా గుర్తిస్తుంది.తగిన సమయంలో సత్కరించిన సందర్భం లేకపోలేదు...సంచలనాల కోసం కాకుండా సత్యం కోసం పనిచేసే జర్నలిస్టులే సమాజంలో శాశ్వత గౌరవాన్ని పొందుతారు. ఎక్కువగా పుస్తక పఠనం పత్రికల పట్టణం చేయాలి. జర్నలిజం దృష్టితో సమాజాన్ని అన్ని కోణాల్లో అధ్యయనం చేయగలగాలి

### ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి

గత 20 సంవత్సరాల క్రితం నాటి పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులు చూస్తే అప్పట్లో మొబైల్ ఫోన్లు అందుబాటులో రాలేదు. కేవలం ప్రజలు తీసుకొచ్చిన వార్తలను విలేకరులు సేకరించిన వార్తలను కంప్యూటర్ల ద్వారా హెడ్ ఆఫీస్ సంబంధించిన (డెస్క్) కు పంపించేది కానీ ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో పెరిగింది. మన చేతుల్లోనే ప్రపంచమంతా కనిపించే స్థాయికి ఎదిగింది. పాత తరం కొత్తతరం జర్నలిస్టులు ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలి.

### స్వీయ పరిశీలన అవసరం

ఏది ఏమైనా మనల్ని మనం ఒక్కోసారి స్వీయ పరిశీలన చేసుకొని సమాజంలో జరుగుతున్న అక్రమాలను అన్యాయాలను ఆసరాగా చేసుకొని బెదిరింపులకు పాల్పడి మనల్ని మనం చులకన చేసుకోకూడదు. హృదయపూర్వకంగా ఇష్ట పూర్తిగా మన వృత్తి చిత్తశుద్ధిని బట్టి ఎవరైనా సంతోషంగా సహకారం అందిస్తే కాదనడానికి లేదు

### వాస్తవాలను విస్మరించకూడదు

డిజిటల్ మీడియా విస్తరించడంతో జర్నలిజం మరింత ప్రభావవంతమైంది. అయితే వేగం కోసం వాస్తవాలను విస్మరించకుండా, ప్రతి వార్తను ధృవీకరించి ప్రజలకు అందించడం అత్యంత అవసరం. ప్రజల విశ్వాసమే జర్నలిస్టుకు అతిపెద్ద సంపద

### హక్కుల సాధన...కుటుంబ సంక్షేమం

జర్నలిస్టులుగా మన బాధ్యత సమాజాన్ని సరిచేసే వారిమి మాత్రమే అనుకోవద్దు అంతకంటే ప్రాముఖ్యంగా మన కుటుంబ సంక్షేమం ఎంతో ప్రాముఖ్యం అదేవిధంగా మన ఆరోగ్య విషయాలను విస్మరించకూడదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మనకు రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు జర్నలిస్టుల హక్కుల సాధన ఉద్యమాలలో తప్పనిసరిగా పాల్గొని మనకంటూ ఒక ప్రత్యేక ముద్రను జర్నలిజంలో వేసుకునే వారిగా ఉండాలి. జర్నలిజంలోకి కొత్తగా వచ్చిన వారికి ఆదర్శ ప్రాయమైన మార్గదర్శకాలు వేసేవారిగా ఉండాలి. అంతే గాని సొంత లాభం స్వార్థం నేనే బతకాలి నేనే ఉండాలి నేనే జర్నలిస్టును అన్న నియంత పోకడలను చేసేవారు జర్నలిస్టు అని చెప్పుకోకూడదు.వసూలు రాజా అని చెప్పుకోవాలి... జర్నలిజంపై మరో కథనంతో మరిన్ని విషయాలతో త్వరలో కలుద్దాం.

# సిపిఐ ప్రచార యాత్రలను జయప్రదం చేయండి

- సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారధి

**(పగడాల రామారావు. ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) ఆగస్టు 2**



సి పి ఐ గార్ల బయ్యారం మండలాల సంయుక్త సమావేశం బయ్యారం మండలం సంతులాల్ పొడు తండా గ్రామంలో ఆదివారం కృష్ణమూర్తి,రాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారధి, సి పి ఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. .. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి విజయసారధి మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్రలు జయప్రదం చేయాలని పిలునిచ్చారు. గత 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై సిపిఐ (జూ×) సమరశంఖం పూరించిందని బిజెపి సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ, సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ఈ నెల ఆగస్టు 6 నుండి 14 వరకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచార యాత్రలు నిర్వహించనున్నట్లు పార్టీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నట్లు విజయసారధి పేర్కొన్నారు.దేశాన్ని పరిపాలించే అర్హతను, హక్కును బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. గత 12 ఏళ్ల కాలంలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం వంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. బీజేపీ అవలంబిస్తున్న వినాశకర విధానాలను అడ్డుకోవడానికి, ప్రజలను చైతన్య పరిచేందుకే ఈ ప్రచార యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 14న జిల్లా కేంద్రంలో జరిగే ముగింపు బహిరంగ సభను విజయవంతం చేసి, కేంద్ర ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ యాత్రల్లో జిల్లాలోని సిపిఐ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ గార్ల బయ్యారం మండలాల కార్యదర్శులు జంపాల వెంకన్న, సారిక శ్రీనివాస్,కలింగరెడ్డి,భుక్య హరినాయక్,నాదెండ్ల పద్మ, మాగం లోకేష్,ధరవత్ వీరన్న, భుక్య పుల్సింగ్,స్వామి, కోటేశ్వరి,కాంతమ్మ, యశ్వత్ తదితరులు పాల్గొన్నారు...



# కాసిపేట లో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపుదాడి

- ఐదుగురు అదుపులో, రూ.1.10 లక్షలకు పైగా నగదు స్వాధీనం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 2**

రామగుండం పోలీస్ కమిషనరేట్ నార్కోటిక్ బృందం/టాస్క్ ఫోర్స్ మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం గ్రామంలో ఓ ఇంటిలో నగదును పందెంగా పెట్టి పేకాట నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో 02-08-2026 అర్ధరాత్రి సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని మెరుపుదాడి నిర్వహించారు.ఈ దాడిలో నగదు పందెం నిర్వహిస్తూ పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.1,10,630 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు,వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కాసిపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా లేదా జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా రామగుండం పోలీస్ కమిషనరేట్ నార్కోటిక్ బృందం/టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.




# లాంగ్వార్ స్థలంలో బస్టాండ్ మరో చోటుకు మార్చాలని డిమాండ్

కాంగ్రెస్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు మమ్మద్ గౌస్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 2**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కొత్త బస్టాండ్ లో భారీ వర్షాల కారణంగా బస్టాండ్ లోపటి భాగంలో ఆర్టీసీ కంట్రోలర్ డ్రైవర్స్ కండక్టర్స్ నిలబడచోట భారీ హోల్ గుంత పడినది ప్రయాణికులకు భద్రత లేకుండా పోయినది ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉన్నది రాత్రిపూట ఏదన్నా జరగకూడనిది ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరు బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ ఈరోజు బస్టాండ్ ను సందర్శించినారు సంతోషం కానీ ఆ బస్టాండ్ ను బెల్లంపల్లి సింగరేణి ఏరియా స్టోర్స్ వద్ద బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పక్షాన మీతో,విన్నవించుకుంటున్నాం సింగరేణి జిఎం, మందమరి ఏరియా మరియు ఆర్టీసీ ఎండి అధికారులు వచ్చి సందర్శించినారు కానీ దానిపై ఏమి చర్యలు తీసుకున్నారు దాని చుట్టూ ఫెన్సింగ్ వేయండి ఆ దారిని మూసివేయండి గతంలో సింగరేణి,ప్రాంతమైనటువంటి కొన్ని బొగ్గు బావులు 24 డీప్ 35దీప్ బొగ్గు బావులు అండర్ గ్రౌండ్ లో నడిచినవి బంద్ అయిన తర్వాత ఆ ఏరియా సింగరేణి అధికారులు లాంగ్వార్ ఏరియాగా ప్రకటించినారు ఇది రెండోసారి గుంత పడినది ప్రయాణికులకు ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మెల్యే, చొరవతో ఆ బస్టాండ్ ను అక్కడ నుంచి తొలగించి సురక్షితమైన స్థలానికి మార్చవలసిందిగా మీతో,విన్నవించుకుంటున్నాం బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు గౌస్ భాయ్ అజ్గర్ భాయ్ షకీల్ భాయ్,బెల్లంపల్లి ప్రజలు వ్యాపారస్తులు కోరుచున్నాము



# వేములవాడలో ముదిరాజ్ మత్స్యకారుల భవన నిర్మాణానికి భూమిపూజ

- రూ. 6 లక్షలతో నూతన భవనం.. శంకుస్థాపన చేసిన చైర్మన్ పుల్కం రాజు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ శరవేగంగా అభివృద్ధి

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 2**

వేములవాడ పట్టణంలో స్థానిక ముదిరాజ్ మత్స్యకారుల నూతన భవన నిర్మాణానికి సుమారు ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఆదివారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్యఅతిథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ... స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిరంతర సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగానే పట్టణ పరిధిలోని 54 కుల సంఘాల భవన నిర్మాణాల అభివృద్ధికి ప్రతి సంఘానికి రూ. 6 లక్షల చొప్పున నిధులు కేటాయించి, పనులను వేగవంతం చేయడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో అభివృద్ధి నోచుకోని కుల సంఘాలను. కానీ తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే చేతల ప్రభుత్వమని నిరూపిస్తోందన్నారు. ఇటువంటి భవనాలు నిర్మించడం వల్ల ఆయా సంఘాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. సంఘ సభ్యులందరూ ఒకే చోట చేరి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడానికి, తమ సమాజ పురోగతికి సంబంధించిన విషయాలపై విస్తృతంగా చర్చా కార్యక్రమాలు జరుపుకోవడానికి ఈ భవనాలు వేదికగా నిలుస్తాయని తెలిపారు. అంతేకాకుండా సంఘానికి సంబంధించిన విలువైన వస్తువులు, శుభకార్యక్రమాలు మరియు పండుగల సామాగ్రిని సురక్షితంగా భద్రపరుచుకోవడానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని స్పష్టం చేశారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడానికి ఇవి కేంద్ర బిందువులుగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ?అలాగే పట్టణాభివృద్ధిపై కొందరు చోటామోటా నేతలు సోషల్ మీడియా వేదికగా నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, అలాంటి వారికి స్థానిక ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని చైర్మన్ హెచ్చరించారు. వేములవాడ సమగ్ర పురోగతే లక్ష్యంగా పాలన సాగుతోందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమర్థవంతమైన నాయకత్వంలో వేములవాడ పట్టణం అన్ని రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు వెళుతోందని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిరంతర శ్రమ, దృఢ సంకల్పంతో పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారబోతోందని తెలిపారు. పట్టణ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు, రూపురేఖలు మార్చేలా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో ఆరోపణలు చేసే చిల్లర నాయకుల మాటలను ప్రజలు ఎవరూ నమ్మరని, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధే వారికి చెంపపెట్టు అని ఆయన పేర్కొన్నారు.?ఈ భూమిపూజ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుం మధు, పట్టణ కౌన్సిలర్లు తోట రాజు, కొండ రాజశేఖర్, ముదిరాజ్ మత్స్యకార సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



# మద్రాస్ తండా గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 02**

టేకులపల్లి మండలంలోని మద్రాస్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్. ఉమా. నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మద్రాస్ తండా సర్పంచ్ మాలోత్ గాంగ్లి, ఉపసర్పంచ్ జరుపుల లింగ, గ్రామస్తులు భద్రం, సాధు, దసురు, రాజేష్, కిషన్, లాల్చంద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్ బకాయిలు అడిగితే "క్రిమినల్ వేస్ట్" అంటారా

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 2**



రాష్ట్రంలోని 30 లక్షల మంది విద్యార్థులు తమకు రావాల్సిన ?15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తే వారిని "క్రిమినల్ వేస్ట్"గా అభివర్ణించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి, విద్యార్థుల పట్ల ఆయనకున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం కరీంనగర్లో ప్రవీణ్ రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ హక్కులను అడిగితే అవమానించడం కాదు వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థులనే నిందించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. రెండున్నరేళ్లుగా విద్యాశాఖ మీ దగ్గరే ఉంది. ఈ కాలంలో విద్యా నాణ్యతను పెంచేందుకు తీసుకున్న ఒక్క సంస్కరణను అయినా చెప్పగలరా? ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయా? విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ అయ్యాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించారా? స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందాయా? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారా? అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించలేక, ప్రశ్నించే విద్యార్థులనే "క్రిమినల్ వేస్ట్"గా ముద్ర వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. తెలంగాణ యువతను అవమానించే హక్కు ముఖ్యమంత్రికి లేదని స్పష్టం చేశారు.తక్షణమే "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఆగస్టు 4న యాదవ నేతల కీలక భేటీ

## విద్యార్థి వసతి గృహ నిర్మాణ నిధుల సమీకరణ యాత్రపై చర్చ

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 2 (ప్రజా తీర్పు)**

యాదవ విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పాటునందించే లక్ష్యంతో నిర్మించనున్న యాదవ విద్యార్థి వసతి గృహ భవన నిర్మాణానికి నిధుల సమీకరణ యాత్ర నిర్వహణపై కీలక సమావేశం ఈ నెల 4న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాదవ చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత యాదవ మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఉన్న యాదవ చారిటబుల్ ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో నిధుల సమీకరణ యాత్ర నిర్వహణ, కార్యాచరణ ప్రణాళిక, నిధుల సేకరణ విధానం, మండలాలు--గ్రామాల వారీగా బాధ్యతల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న యాదవ సంఘాల నాయకులు, అఖిల భారత యాదవ మహాసభ పదాధికారులు, యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, యువజన, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, యాదవ సమాజ ప్రముఖులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై తమ విలువైన సూచనలు అందించి నిధుల సమీకరణ యాత్రను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేణి రాజేందర్ యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం అధ్యక్షుడు అట్ల సాగర్ యాదవ్ సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

# విద్యానగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ఉప్పు తిరుపతి ప్రమాణ స్వీకారం





- పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 2**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని మల్కాపూర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యానగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ఉప్పు తిరుపతి ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ప్రస్తుత కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ , కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, పురుమల్ల శ్రీనివాస్, తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల నరసన్న మీడియాతో మాట్లాడుతూ, మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు రాజకీయాలు, విద్య, ఉపాధి, వ్యాపారం తదితర అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. కష్టపడే తత్వం, నిజాయితీ, నిబద్ధతే వారి విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. కరీంనగర్ ప్రాంతం నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలుగా అనేక మంది మున్నూరు కాపు నాయకులు ప్రజల ఆదరణతో విజయం సాధించడం అభినందనీయమని చెప్పారు. అలాగే ప్రభుత్వం కల్పిస్తున్న కీలక నామినేటెడ్ పదవుల్లోనూ మున్నూరు కాపు ప్రతినిధులకు అవకాశాలు లభిస్తున్నాయని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర మరింత బలపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## లైబ్రరీ కీ పుస్తకాలు తెప్పించి ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 2**

మంచిర్యాల జిల్లా వేమనపల్లి లైబ్రరీని గత వారం రోజుల క్రితం సందర్శించిన సందర్భంగా లైబ్రరీ లో కాపీటిట్యూవ్ పుస్తకాలు అందుబాటులో లేవు అని తెలియజేసిన విద్యార్థులు. అందుకు సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్,ఈరోజు వేమనపల్లి లైబ్రరీకి తన సొంత డబ్బులతో పుస్తకాలు తెప్పించి ఇవ్వడం జరిగింది. అలాగే జిల్లా గ్రంధాలయ సంస్థ సెక్రటరీ గారితో మాట్లాడి మంచిర్యాల లైబ్రరీ నుండి కుర్చీలను కూడా తెప్పించి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను కాంపిటిట్యూవ్ ఎగ్జామ్స్ లో ఈ ప్రాంత ప్రతిభను కనపరిచి ఉద్యోగలు సాధించాలని ప్రవీణ్ కోరడం జరిగింది. అలాగే విద్యార్థులందరు లైబ్రరీలో వాటర్ క్యూరిఫై కూడా కావలని కోరడం జరిగింది. దానిని కూడా ఏర్పాటు చేస్తాను అని మాట ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంధాలయ ఆవరణలో మొక్కలు నాటిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ తో పాటు దస్నాపూర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, ఏనుముల శేఖర్, చెన్నూరు సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేగా కాంతారావుపై కేసు రాజకీయ కక్ష సాధింపే: లావుడ్యా సత్యనారాయణ నాయక్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 2 (ప్రజా తీర్పు)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావుపై నమోదైన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని బీఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షుడు లావుడ్యా సత్యనారాయణ నాయక్ ఆరోపించారు. ప్రజల కోసం ప్రశ్నించే నాయకులను తప్పుడు కేసులతో భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యలపై గొంతు విప్పి మాట్లాడితే కేసులు నమోదు చేసి వేధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. జిల్లాలో రేగా కాంతారావుకు పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేక రాజకీయ ప్రత్యర్థులు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒక మహిళను అడ్డుపెట్టుకుని రేగా కాంతారావును రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే ఈ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతున్న యువతి తాను ఫిర్యాదు చేయలేదని చెప్పిన నేపథ్యంలో పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అణచివేయాలనే ప్రయత్నాలు ఎంత చేసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని లావుడ్యా సత్యనారాయణ నాయక్ స్పష్టం చేశారు.



## మంచిర్యాల: శ్రీరాంపూర్ కాలనీ పోచమ్మ దేవాలయం గుడి కమిటీ నిర్మాణం :

**(అరికిల్ల జయకుమార్ ప్రజా తీర్పు మంచిర్యాల) ఆగస్టు 2**

వాటర్ టాంక్ ఏరియా సభ్యుల సమక్షంలో నిర్వహించిన కమిటీ అధ్యక్షులుగా అరుకాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా బండారి సుధాకర్, ఉపాధ్యక్షులుగా గద్దల మధు, ప్రధాన కార్యదర్శి రాసమల్ల దేవేందర్ ముఖ్య సలహాదారులుగా జక్కుల రాజేశం, ఈసంపెల్లి ప్రభాకర్, వేల్పుల రవీందర్, వనపర్తి రాజేష్, ప్రచార కార్యదర్శి వడిజ మహేందర్, వేముగంటి శ్రీనివాస్, కోశాధికారి లకవత్ రమేష్, ప్రెస్ అండ్ మీడియా బాస్కర్ల రాజేశం, సాంస్కృతిక అధ్యక్షులు భోగ మధునయ్య, కార్యదర్శి పెద్దపల్లి శంకర్.



## రాష్ట్ర ఆర్యవైశ్య యువజన కార్యదర్శిగా రావికంటి సతీష్ కుమార్ నియామకం

### తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం నూతన కార్యవర్గంలో చోటు

**మంథని, ఆగస్టు-02 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణానికి చెందిన రావికంటి సతీష్ కుమార్ కు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం లభించింది. హైదరాబాద్‌లోని లక్డికాపూల్ వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు, యువజన ప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సమాజాభివృద్ధి, యువత సంక్షేమం, సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రావికంటి సతీష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవడం పట్ల మంథని ప్రాంత ఆర్యవైశ్య సంఘ నాయకులు, వ్యాపారవేత్తలు, యువజన ప్రతినిధులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమాజ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అంబేద్కర్ అభయ హస్తం ద్వారా దళిత యువతీ యువకులకు ఉపాధి కల్పించాలి...
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య డిమాండ్...

**కురవి ఆగస్టు 02(ప్రజా తీర్పు విలేఖరి)**



సమాజంలో అత్యంత వెనుకబడ్డ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంబేద్కర్ అభయ హస్తం ద్వారా యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజున ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కురవి మండలంలోని బలపాల దళిత కాలనీ లో సర్వే నిర్వహించారు. అనంతరం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య మాట్లాడుతూ.. గ్రామంలో 250 దళిత కుటుంబాలు ఉన్నాయని దళితులు అంతా రెక్కల కష్టం మీద ఆధారపడి వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని ఇల్లు లేని వారికి ఎలాంటి అభ్యంతరం పెట్టకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏలాంటి ఉపాధి లేక యువతీ,యువకులు పెయింటర్స్,బిల్డింగ్ వర్కర్స్ కూలీలుగా పనిచేస్తున్నారని వారికి అంబేద్కర్ అభయ హస్తం కింద 12 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు. దళితులకు కేటాయించిన కమ్యూనిటీ హాల్ శిథిలావస్థలో ఉందని కొత్త నిర్మాణానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వాళ్లందరికీ వితంతు,వికలాంగుల, వృద్ధాప్య పెన్షన్ లను మంజూరు చేయాలని, అలాగే ప్రభుత్వం హామీ ఇచ్చిన మహిళలకు 2500/- రూపాయలు వ్యవసాయ కూలీలకు ఏటా 12000/-రూపాయలు పెన్షన్ పెంపు 2016 నుండి 4000/-రూపాయల వరకు,వికలాంగులకు 6000/- రూపాయలు ఇచ్చి హామీ నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య,గ్రామ ఉప సర్పంచ్ పిట్టల వెంకన్న,రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మలేటి కోటయ్య, గిరిజన సంఘం కురవి మండల కార్యదర్శి మాలోత్ కిషన్ నాయక్,మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు పిట్టల దర్గయ్య,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు శనిగరం వెంకన్న,సిఐటియు నాయకులు గోపి,స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: బచ్చలకూర శ్రీనివాసరావు

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 2 (ప్రజా తీర్పు)**

ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం సుజాతనగర్ మండల కార్యదర్శి బచ్చలకూర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం ఆగస్టు 5న సుజాతనగర్‌లోని చింతలపూడి సత్యం భవనంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కార్మికులు, ప్రజాసంఘాల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సుజాతనగర్‌లో రైతు సంఘం మండల అధ్యక్షుడు నల్లగోపు పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని దెబ్బతీసే చట్టాలను రద్దు చేయాలని, విత్తనాల ప్రైవేటీకరణ, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, విదేశీ విత్తనాలకు సంబంధించిన విధానాలను వెనక్కి తీసుకోవాలని, రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని, కార్మికుల 29 చట్టాలను యథాతథంగా కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు వీర్ల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గండమాల భాస్కరరావు, సీఐటీయూ మండల నాయకులు నర్రా శివరామకృష్ణ, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాట్రాల తిరుపతిరావు, సీఐటీయూ నాయకులు చింతల శ్రీను, రైతు సంఘం మండల నాయకులు భూక్యా శంకర్, బాలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## హమాలి సంఘం అధ్యక్షుడిగా నర్ర ఓదెలు.. ప్రధాన కార్యదర్శిగా కటుకు అనిల్ విజయం

**మంథని, ఆగస్టు-02 (ప్రజాతీర్పు)**



మంథని హమాలి సంఘం అధ్యక్షుడిగా నర్ర ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా కటుకు అనిల్ విజయం సాధించారు. ఆదివారం మంథని పట్టణం హమాలి సంఘం కార్యాలయంలో కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా కాసెట్టి సురేష్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి నర్ర ఓదెలు, రంగు కొమురయ్య పోటీ పడగా అధ్యక్షుడిగా నర్ర ఓదెలు, , ప్రధాన కార్యదర్శి స్థానానికి కటుకు అనిల్, రంగు శంకర్ పోటీ పడగా ప్రధాన కార్యదర్శిగా కటుకు అనిల్ విజయం సాధించారు. కార్యవర్గ సభ్యులుగా బిరుదు శంకర్, మేకు రవి, మద్రిపల్లి సది, రాపాక సమ్మయ్య, కారి కుమార్, చిట్టవేన కుమార్, గడి కళ్యాణ్, బుక్క పుల్లయ్య లు ఏకగ్రీవంగా గెలుపొందారు. గెలిచిన అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి పాటుపడతామని తెలిపారు.



## ఫ్రెండ్షిప్ డే సందర్భంగా పార్క్ లో వేడుకలు చేసుకున మహిళా మణులు

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 2**

ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మహిళా స్నేహితులు అంత కలసి పార్క్ లో వేడుకలు జరుపుకున్నారు. చక్కగా అందరు అంతకాశారి , చేమచేకా , ఆటలు ఆడుకొని ఒకరి ఒకరు చేతికి ఫ్రెండ్షిప్ బాండ్స్ కట్టుకున్నారు. ఇందులో ప్రతాప చందన, మౌనిక, రేఖ, అరుణ, వసుంధర, శోభ, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడు

- బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ

**కోరుట్ల ఆగస్టు 2 (ప్రజాతీర్పు)**








నిత్యం మనకు సాక్షాత్కరించే ప్రత్యక్ష దైవమే సూర్య భగవానుడని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం రెండో రోజు కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యుడు ప్రతిరోజూ కాంతిని ప్రసాదిస్తూ జీవకోటిని కాపాడుతున్న ప్రత్యక్ష దైవమన్నారు. కోణార్కలోని సూర్య భగవానుని పవిత్ర క్షేత్రాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. సనాతన ధర్మంలో సూర్యుడిని ద్వాదశ సూర్యులుగా అభివర్ణించారని వివరించారు. సూర్య భగవానుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కోరికలు నెరవేరడంతో పాటు ముక్తి లభిస్తుందని పురాణాల్లో వివరించినట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు మంచాల జగన్, చిదురాల నారాయణ గురుస్వామి దంపతులు, బట్టు హరికృష్ణ, రేగుంట రాజారామ్, పడిగెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టానికి ఆఫీసర్ల తప్పుడు కారణాలతో ఆర్టీఐ దరఖాస్తు తిరస్కరణ

- తప్పుడు తేదీ లేక పంపించిన ఎంపీడీవో పై చర్యలు లేవాలి
- అధికారుల పట్ల నిర్లక్ష్యం ఎందుకులి

**నర్సంపేట రూరల్, ఆగస్టు 02, ప్రజా తీర్పు ప్రతినిధి:**






బానోజీ పేట గ్రామం నర్సంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం (=×) ప్రకారం కోరిన సమాచారానికి అధికారుల నుండి బాధ్యతారాహిత్య సమాధానం లభించింది. =× దరఖాస్తుదారు దరఖాస్తు చేసుకోగా, “రేషన్ కార్డ్ సంబంధించిన స్టాంపులు అతికించి ఇవ్వలేదా”ఆర్టిఏ వేసిన తేదీ 7/04/2026 తిరిగి పంపించిన తేదీ 16/02/2026 అంటూ తప్పుడు తేదీతో దరఖాస్తును ఎంపీడీవో కార్యాలయం తిప్పి పంపడం స్థానికంగా కలకలం రేపుతోంది. దీనికి తోడు గ్రామ కార్యదర్శి రద్దు చేసిన కాఫీకి తప్పుడు తేదీతో జవాబు ఇవ్వడంకూడా అసంబద్ధమైన వివరణ ఇస్తూ సమాచారాన్ని దాటవేసే ప్రయత్నం చేశారని బాధితుడు ఆరోపించారు. చట్ట ప్రకారం 30 రోజుల్లోగా ఖచ్చితమైన సమాచారం ఇవ్వాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యం వల్ల సమాచార హక్కు చట్టం లక్ష్యం దెబ్బతింటోందని వాపోయారు.?చట్టాన్ని ఉల్లంఘించి, తప్పుడు తేదీలతో ఆర్టీఐ అప్లికేషన్లను తిరస్కరిస్తున్న సంబంధిత ఎంపీడీవో మరియు గ్రామ కార్యదర్శిపై ఉన్నతాధికారులు తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, కోరిన సమాచారాన్ని వెంటనే ఇప్పించాలనిదరఖాస్తుదారు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.





## 7 శాతానికి బీవోఎం గృహ వడ్డీరేటు

ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం)..మాన్‌సూన్ ధమాకా ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వల్పకాలం మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద గృహ రుణాలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో వడ్డీరేటు 7.10 శాతం నుంచి 7 శాతానికి దిగొచ్చింది. దీంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ చార్జీలను పూర్తిగా ఎత్తివేసింది. తమ వినియోగదారులందరికీ ఉత్తమ ఆర్థిక ప్రయోజనాలను కల్పించడంతోపాటు వారి కలలను సాకారం చేసుకోవడంలో సహాయపడటానికి బ్యాంక్ ఎల్లప్పుడు కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగానే ఒకేసారి మూడు ప్రయోజనాలు కల్పించాలని నిర్ణయించినట్టు పేర్కొంది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో అందిస్తున్న అత్యల్ప గృహ రుణంపై వడ్డీరేటు 7 శాతం కాగా, వాహన రుణాలపై 7.45 శాతానికి అందిస్తున్నది బ్యాంక్ మాత్రమే. దీంతోపాటు జీరో ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ చార్జీలు లేకపోవడంతో కస్టమర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలుగనున్నాయని పేర్కొంది.



## ఐటీలో కొత్త ఉద్యోగాలు కష్టమే.. జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు

ఏఐ, డాటా సెంటర్ మౌలిక సదుపాయాల వ్యయం విపరీతంగా పెరుగడంతో ఐటీ పరిశ్రమలో కొత్త ఉద్యోగాల సృష్టి తగ్గిందని జోహో కార్పొరేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు అన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితులను భారత్ కూడా ఎదుర్కొంటున్నదని అభిప్రాయపడ్డారు. కొత్త ఉద్యోగాల కోసం పెట్టే ఖర్చును కార్పొరేట్ సంస్థలు ప్రస్తుతం ఏఐ, సర్వర్లు, మెమోరీ ధరల పెరుగుదల వల్ల డాటా సెంటర్ల వ్యయాలకు కేటాయిస్తున్నాయన్నారు. ఏఐ టెక్నాలజీ సేవలు అందిస్తున్న సంస్థలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నాయని, ఆ వ్యయానికి తగ్గట్టుగా లాభాలు ఆశిస్తున్నాయో తెలియడం లేదన్నారు. ఆటోమేషన్ వల్ల తయారీ రంగం కూడా భారీ స్థాయిలో ఉద్యోగాలను సృష్టించలేకపోతున్నదన్నారు.



## ఈసారి వడ్డీరేట్లు యథాతథమే.. ద్రవ్యోల్బణ గణాంకాలే కీలకం!

### ఆర్థిక విశ్లేషకుల అంచనా

ముంబై, ఆగస్టు 2 : వడ్డీరేట్లు తగ్గుతాయి..ఆర్థిక ఉపశమనం కలుగుతుందని ఆశించిన వారికి ఈసారి కూడా నిరాశే ఎదురుకావచ్చు. రిజర్వుబ్యాంక్ ఆగస్టు నెల ద్రవ్యపరపతి సమీక్షలోనూ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవని అత్యధిక మంది ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తన ఆగస్టు సమీక్ష ఈ నెల 3న ప్రారంభమై 5న నిర్ణయాన్ని ప్రకటించనున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో క్రూడాయిల్ ధరలు ఇంకా గరిష్ఠ స్థాయిలోనే కదలాడుతుండటం, దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ధరల సూచీ రివ్వున ఎగిసింది. దీంతో వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను యథాతథ స్థితికే సెంట్రల్ బ్యాంక్ మొగ్గుచూపే అవకాశాలున్నాయని పది మంది ఆర్థికవేత్తలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి ఎగబాకడంతో ఆర్బీఐ ప్రస్తుతం వేచి చూసే ధోరణి అవలంబించవచ్చునని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను సెంట్రల్ బ్యాంక్ 5.1 శాతానికి పెంచిందని, నిజానికి ద్రవ్యోల్బణం అదుపునకు సంబంధించి ఆర్బీఐ లక్ష్యం 4 శాతంగా పెట్టుకున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దీనిని సవరించింది. ఆహారోత్పత్తులు రివ్వున దూసుకెళ్లడంతో ఆర్బీఐకి వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయం సన్నగిల్లిందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ..ద్రవ్యోల్బణం నియంత్రించడమే తమ ప్రధాన లక్ష్యమని, దేశవ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సానుకూల వర్షాలు కురుస్తుండటంతో భవిష్యత్తులో తగ్గే అవకాశం కూడా ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. గడిచిన ఏడాదికాలంలో రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను 1.25 శాతం వరకు తగ్గించిన విషయం తెలిసిందే.

### వర్షాలు కీలకం

దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడంలో వర్షాలది కీలకపాత్రని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో ఎక్కువమంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల భారీగాను, మరికొన్నిచోట్ల ఆశించిన స్థాయిలో కురువడం లేదని ఒకింత ఆందోళన వెలిబుచ్చారు. మరోవైపు, దేశ వృద్ధిరేటు భారీగా పుంజుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదని వారు అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పడిపోవడం, ఇంధన ధరలు భగ్గుమనడం, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా వృద్ధికి బీటలు పడే అవకాశాలు మెండుగావున్నాయన్నారు. అలాగే ద్రవ్యోల్బణం ముప్పు, వడ్డీరేట్ల పెరుగుదల, కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు క్షీణత, నిరుద్యోగం వంటి సమస్యలకు దారితీస్తున్నది. మరోవైపు ఎల్ నినో కారణంగా ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలు కనిపించడం లేదు. ఇదే జరిగితే పంటల సాగు, దిగుబడి ప్రభావితమై ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్నంటే వీలున్నది. ఆర్బీఐ ఇప్పుడు ఈ అంశాలపైనే ఆందోళన చెందుతున్నది.

# బోడుప్పల్ సర్కిల్‌లో గులాబి గూటికి... 40 మంది యువకులు

- జావిద్ ఖాన్ ఆధ్వర్యంలో చేరికలు, పార్టీ కండువా కప్పి పార్టీలోకి.
- ఆహ్వానించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి.

**బోడుప్పల్ సర్కిల్, ఆగస్టు 2. ( ప్రజాతీర్పు )**




మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లకు చెందిన సుమారు 40 మంది యువకులు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. మాజీ కో-ఆప్షన్ సభ్యులు నాజియా జావిద్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమం పీర్జాదిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి యువతకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతలోనే ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అలాగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు ఉపాధి, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు ప్రాధాన్యత కల్పిస్తూ టీ-హబ్ వంటి అంతర్జాతీయ స్థాయి వేదికలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. యువత తమ ప్రతిభను ప్రపంచానికి చాటుకునే అవకాశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించిన ఆయన,రైతులు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా యువత మళ్లీ బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతోందని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న పోరాటానికి యువత మద్దతు తెలుపుతోందని, అందుకే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారని జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ... తెలంగాణ అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి,మాజీ కార్పొరేటర్లు కొల్తూరిమహేష్, మధుసూదన్ రెడ్డి,కొడేపోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, మైనారిటి అధ్యక్షులు జిలాని పాషా, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, పింగళి జోగిరెడ్డి, బుల్లెట్ శంకర్, ప్రవీణ్ రెడ్డి, వెంకట్,చిర్ర సంతోష్, సుభాన్, గోపాల్ రెడ్డి, పన్నాభాయ్, అమర్ పటేల్, అజ్హర్ అహ్మద్, సయ్యద్ అబ్రార్, సమీఉద్దీన్, అజ్హర్ ఖాన్, సయ్యద్ అర్బాజ్, సయ్యద్ ఇల్యాస్, మహ్మద్ పర్వేజ్ ఆలం, సొహైల్ హుస్సేన్, రహీమ్ ఖాన్, మహ్మద్ పాషా, సమీర్ ఖాన్, రేహాన్, షేక్సమీర్ హుస్సేన్, రియ్యాన్ హుస్సేన్, షఫీ హుస్సేన్, ఒగ్గు మధు, ఖలీక్ హుస్సేన్, షాకిర్ ఖాన్, సుఫియాన్ హుస్సేన్, తయ్యబ్ అన్సారీ, ఎం.డి. మూసా, జీషాన్, షహ్నవాజ్, సల్మాన్, ఫైజాన్, గణేష్ స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాటపై పోలీసుల దాడి పలువురు అరెస్ట్

**రామడుగు, ఆగస్టు 2 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండలంలోని వెలిచాల గ్రామంలో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో రామడుగు పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దాడి సమయంలో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. పోలీసులు రావడంతో కొందరు పరారయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.10,420 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు, పత్తాల కట్టలు, జూదం నిర్వహణకు ఉపయోగిస్తున్న ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, మొబైల్ ఫోన్లను చట్టపరమైన ప్రక్రియ ప్రకారం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు రామడుగు ఎస్ఐ కోదాటి రాజు తెలిపారు. జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు సమాజంలో నేరాలను ప్రోత్సహించడంతో పాటు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలకు రెక్కలు!



ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలకు మళ్లీ రెక్కలురాబోతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ఏఐ సర్వర్ల డిమాండ్‌లో పెరుగుదల కారణంగా, కీలకమైన హార్డ్‌వేర్ ప్లాట్‌ఫామ్ అయిన ప్రింటెడ్ సర్క్యూటర్ బోర్డుల కొరత ఏర్పడింది. దీంతో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ధరల పెరుగుదలకు ప్రధాన కారణమైందని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో భాగాలను అమర్చే హార్డ్‌వేర్ ప్లాట్‌ఫారమ్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల కొరతకు పెరుగుతున్న ముడి పదార్థాల ధరలు, కీలక రవాణా మార్గాల్లో సరఫరా అంతరాయాలు, ఏఐ టెక్నాలజీ కోసం అధికంగా ఖర్చు చేయాల్సి రావడం కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని పేర్కొన్నాయి.




## 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. గడిచిన నెలకుగాను రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.83 లక్షల కోట్లతో పోలిస్తే 15.4 శాతం అధికంగా. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్లకు పైగా వసూలు కావడం ఇది రెండోసారి కావడం విశేషం. జూన్ నెలకుగాను రూ.1.95 లక్షల కోట్లు వసూలయ్యాయి. అమ్మకాలు, దిగుమతుల ద్వారా సమకూరే ఆదాయం, దేశీయ వినియోగం నిలకడగా ఉండటం వల్లనే జీఎస్టీ వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొంది. జూలై నెలలో వసూలైన జీఎస్టీలో దేశీయంగా రూ.1.44 లక్షల కోట్లు వసూలవగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్నుతో రూ.66,511 కోట్ల నిధులు సమకూరాయి.

### తెలంగాణలో రూ. 5,819 కోట్లు

తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా జీఎస్టీ వసూలయ్యాయి. జూలై నెలకుగాను రూ.5,819 కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో పోలిస్తే 19 శాతం వృద్ధిని సాధించింది. అలాగే రాష్ట్ర చరిత్రలో ఒకే నెలలో ఇంతటి స్థాయిలో వసూలవడం కూడా ఇదే తొలిసారి. హర్యాన తర్వాత అత్యధికంగా వసూలైనది ఇక్కడే. దీంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లలో రెండంకెల వృద్ధి నమోదైంది. స్థూల సెంట్రల్ జీఎస్టీ వసూళ్లు రూ.39,835 కోట్లుగా నమోదయ్యాయి. అలాగే స్టేట్ జీఎస్టీ వసూళ్లు కూడా రూ.47,881 కోట్లకు చేరుకోగా, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ వసూళ్లు రూ.1.23 లక్షల కోట్లుగా ఉన్నాయి. రూ.29,968 కోట్ల రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. కిందటేడాదితో పోలిస్తే ఇది 13.1 శాతం అధికం. రిఫండ్ చెల్లింపులు జరిపిన తర్వాత జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లుగా ఉన్నాయి.

# ఆర్బీఐ నిర్ణయమే దిక్సూచి.. పశ్చిమాసియాలో నెలకొననున్న పరిస్థితులు కూడా..!

### ఈ వారం స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న పరిణామాలు




దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారంలో తీవ్ర ఒడిదుడుకులు లోనుకావచ్చునని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వడ్డీరేట్లపై రిజర్వు బ్యాంక్ తీసుకునే నిర్ణయం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు తోడు క్రూడాయిల్ ధరలు సూచీల ట్రేడింగ్‌నకు దిక్సూచిగా మారనున్నాయి. అలాగే కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తీసుకునే నిర్ణయాలు కూడా మదుపర్లలో సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. రిజర్వుబ్యాంక్ తన ద్రవ్యపరపతి సమీక్షా సమావేశాన్ని ఈ నెల 5న ప్రకటించనుండటంతో మార్కెట్ వర్గాలు దీనిపై ప్రధానంగా దృష్టిసారించనున్నారని, కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు ఈ వారంలోనే ముగియనుండటం కూడా సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నదని రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్ సీనియర్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొననున్న పరిణామాలు, మరి ముఖ్యంగా ఇరాన్-అమెరికా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వస్తే సూచీలు భారీగా పుంజుకునే అవకాశం ఉందన్నారు. వీటికి తోడు క్రూడాయిల్ ధరలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు కీలకంగా మారుతుందన్నారు. ఈ వారంలోనే డీఎల్ఎఫ్, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, హీరో మోటోకార్ప్, ఎల్ఐసీ, ఎస్బీఐలు తన తొలి త్రైమాసికపు ఆర్థిక ఫలితాలను విడుదల చేయబోతున్నాయి. గతవారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 2,035 పాయింట్లు లేదా 2.67 శాతం, ఎన్ఎస్ఈ నిఫ్టీ 616 పాయింట్లు లేదా 2.59 శాతం బలపడిన విషయం తెలిసిందే.

### ఎఫ్‌పీఐల పెట్టుబడుల జోరు

గత నాలుగు నెలలుగా పెట్టుబడులను భారీగా తరలించుకుపోయిన విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు జూలై నెలలో ఏకంగా రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు కుమ్మరించారు. అంతర్జాతీయ దేశాలతో పోలిస్తే దేశీయ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం, మార్కెట్లు కూడా స్థిరంగా ట్రేడవుతుండటంతో విదేశీ మదుపర్లు భారీగా పెట్టుబడులు పెట్టారు. కార్పొరేట్లు ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో గత నెలలో రూ.20,200 కోట్ల పెట్టుబడులు పెట్టారు. జూన్ నెలలో రూ.49,340 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐలు..మే నెలలో రూ.32,963 కోట్లు, ఏప్రిల్ నెలలో రూ.60,847 కోట్లు, మార్చి నెలలో అయితే ఏకంగా రూ.1.17 లక్షల కోట్లను తరలించుకుపోయారు. గత నాలుగు నెలల్లో రూ.2.60 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నట్టు అయింది. దేశీయ ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటం, లార్జ్-క్యాప్ సంస్థలు మెరుగైన పనితీరు కనబరుస్తుండటంతో విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపడానికి ప్రధాన కారణాలని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ వీకే విజయకుమార్ తెలిపారు. దక్షిణకొరియా, తైవాన్ సూచీలు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను భారత్‌కు తరలించారని పేర్కొన్నారు.

### 2.51 లక్షల కోట్లు పెరిగిన మార్కెట్ విలువ

బ్లూచిప్ సంస్థల మార్కెట్ విలువ రాకెట్ వేగంతో దూసుకుపోయింది. గతవారంలో టాప్-10 కంపెనీల్లో తొమ్మిది సంస్థల మార్కెట్ విలువ రూ.2.51 లక్షల కోట్ల మేర పెరిగింది. వీటిలో బజాజ్ ఫైనాన్స్ విలువ అత్యధికంగా రూ.80 వేల కోట్లకు పైగా ఎబాకింది. గత వారంలో కంపెనీ షేరు 8 శాతం పెరుగడమే ఇందుకు కారణం. దీంతోపాటు భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్, ఎస్బీఐ, ఎల్అండ్ టీ, ఎల్ఐసీ మార్కెట్ విలువ కూడా భారీగా పెరిగింది. కానీ, హిందుస్థాన్ యునిలీవర్ మార్కెట్ విలువ రూ.10,326.46 కోట్లు కరిగిపోయి రూ.4,93,602.13 కోట్లకు పడిపోయింది.

# టాప్-5లో ముగించి.. కామన్వెల్త్‌లో అదరగొట్టిన భారత్

- అంచనాలకు మించి రాణించిన బాక్సర్లు
- జూడోలో పసిడి వెలుగులు
- సత్తాచాటిన పారా క్రీడాకారులు




గ్లాస్గో : ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో టాప్-5 లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్.. అనుకున్నది సాధించింది. గతంతో పోలిస్తే భారత్‌కు పతకాలు లభించే రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలను ఈసారి తొలగించినా టోర్నీలో ఆడించిన ఆటల్లోనే మన క్రీడాకారులు సత్తాచాటి పతకాల పట్టికలో దేశాన్ని నాలుగో స్థానంలో నిలిపారు. ముఖ్యంగా బాక్సర్లు అంచనాలకు మించి పసిడి పంచ్‌లు విసిరి గ్లాస్గోలో స్వర్ణ చరిత్ర లిఖించగా అథ్లెట్లు మునుపెన్నడూ లేని రికార్డులను తిరగరాస్తూ పతకాల మోత మోగించారు. బాక్సర్లు, వెయిట్ లిఫ్టర్లు, అథ్లెట్లు మెరవడంతో ఈ టోర్నీలో భారత్ 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తంగా 39 పతకాలు సాధించి నాలుగో స్థానంతో టోర్నీని ముగించింది. ఆస్ట్రేలియా అగ్రస్థానాన ఉండగా ఇంగ్లండ్, కెనడా.. భారత్ కంటే ముందున్నాయి. ఈ క్రీడల తర్వాతి ఎడిషన్ (2030)కు భారత్‌లోని అహ్మదాబాద్ నగరం ఆతిథ్యమివ్వనుంది.

### బాక్సర్ల పసిడి పంట

ఈసారి దేశానికి పసిడి కాంతులు పంచడంలో బాక్సర్లదే హవా. పలు క్యాటగిరీల్లో పదిమంది బాక్సర్లు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తే వారిలో ఏకంగా ఏడుగురు పసిడి పంచ్‌లు విసరగా ముగ్గురు రజతాలతో మెరిశారు. ముఖ్యంగా అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు దుమ్మురేపారు. ఏడు స్వర్ణాల్లో ఐదుగురు (ప్రీతి పవార్, సాక్షి చౌదరి, ప్రియా ఘంఘాస్, అరుంధతి చౌదరి, జైస్మిన్ లంబోరియా) వారివే కాగా ఇద్దరే అబ్బాయిలు (సచిన్, అంకుశ్) గోల్డ్ గెలిచారు. బాక్సర్ల కంటే ముందు రెజ్లర్లు సత్తాచాటి 8 మెడల్స్ గెలుచుకున్నారు. వీరిలో మీరాబాయి స్వర్ణం సాధించగా జ్ఞానేశ్వరి, హర్జిందర్, రిషికంత, అజయ్ బాబు, లవ్‌ప్రీత్ రజతాలతో మెరిశారు.

### జుడోకాల స్వర్ణ చరిత్ర

ఈ క్రీడల చరిత్రలో స్వర్ణం గెలువని జుడోకాలు ఈసారి అ'ద్వితీయ' ప్రదర్శనతో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. డోపింగ్ తంటాలు, లగేజీ సమస్యలతో సతమతమైనా యువ జుడోకాలు అస్మిత, హర్ష్ సింగ్ గోల్డ్ మెడల్స్‌తో కొత్త చరిత్ర సృష్టించారు. యామిని రజతంతో మెరవగా ఉన్నతి కాంస్యంతో సరిపెట్టుకుంది.

### అథ్లెట్ల జోరు

అథ్లెటిక్స్‌లో భారత్ ఈసారి 9 పతకాలు గెలుచుకుంది. పదివేల మీటర్ల పరుగు పందెంలో గుల్వీర్ సింగ్ దేశానికి తొలిసారి (రజతం) పతకం అందించగా అతడే.. 5వేల మీటర్ల రేసులోనూ కాంస్యం గెలిచి సీడబ్ల్యూజీలో రెండు మెడల్స్ గెలిచిన ఫస్ట్ ట్రాక్ అథ్లెట్(భారత్)గా రికార్డులకెక్కాడు. తేజస్విన్ శంకర్ డెకథ్లాన్‌లో దేశానికి తొలి పతకాన్ని తీసుకొచ్చాడు. జావెలిన్ త్రో అంటేనే దేశానికి గుర్తొచ్చే నీరజ్ చోప్రాతో పాటు భారత్‌లో కొత్త అథ్లెట్ దూసుకొచ్చాడు. యశ్వీర్ సింగ్ కాంస్యం గెలిచి భవిష్యత్ ఆశాకిరణంలా కనబడుతున్నాడు. పారా అథ్లెట్ల విషయానికొస్తే షాట్‌పుటర్ షర్మిల ధనకర్ (ఎఫ్57) పారా క్రీడల్లో తొలి స్వర్ణాన్ని దేశానికి అందించింది. ఇక పురుషుల వంద మీటర్ల టీ47 ఈవెంట్‌లో దిలీప్ గవిత్.. 10.71 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి సీడబ్ల్యూజీలో కొత్త రికార్డు నెలకొల్పాడు.

### ఆఖరి రోజు పతకాల్లేకుండానే..

ఆటల ఆఖరి రోజైన ఆదివారం భారత్‌కు పతకాలేమీ రాలేదు. జూడోలో భారత్ ఆశలు పెట్టుకున్న ఇష్రూప్ (మహిళల 78 కిలోలు).. బ్రాంజ్ మెడల్‌కు అర్హత సాధించినా ఆ పోరులో నెగ్గలేకపోయింది. పురుషుల 100 కిలోల విభాగంలో అవతార్ సింగ్, యశ్ ఘంఘాస్ రౌండ్ ఆఫ్-16లోనే ఇంటిబాట పట్టారు. ట్రాక్ సైక్లింగ్‌లో భాగంగా మెన్స్ 1000 మీటర్ల టైమ్ ట్రయల్‌లో రొనాల్డోతో పాటు పారా సైకిలిస్ట్ లిషా దాస్ సైతం నిరాశపరిచారు.



## లక్ష్యంపైనే దృష్టి పెట్టండి

భారత హాకీలో చర్చనీయాంశమైన జెర్సీ వివాదాన్ని పక్కనబెట్టి ఆటగాళ్లు వరల్డ్‌కప్ ట్రోఫీ సాధనే లక్ష్యంగా ముందుకుసాగాలని దిగ్గజ గోల్‌కీపర్ శ్రీజేష్ జట్టుకు సూచించాడు. జెర్సీ రంగు మార్పుపై తీవ్ర వివాదం నడుస్తున్న వేళ శ్రీజేశ్ మాట్లాడుతూ.. 'మైదానం వెలుపల జరిగేదానిపై జట్టు ఎప్పుడూ దూరంగానే ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్న చర్చపై జట్టులోని ఆటగాళ్లకు అవగాహన ఉంటుంది. దీనిని పక్కనబెట్టి పూర్తిగా ఆటపైనే దృష్టి సారించాలి. ప్రపంచకప్ ట్రోఫీ కోసం మనం 50 ఏండ్లుగా వేచి చూస్తున్నాం. ఈసారి ట్రోఫీని దక్కించుకోవడానికి మనకు సువర్ణావకాశం ఉంది. మన పూల్‌లో ఇంగ్లండ్ ఒక్కటే కఠినమైన జట్టు. గ్రూప్ దశలో అగ్రస్థానాన నిలిస్తే సెమీస్‌లో అర్జెంటీనా ఎదురవుతుంది. మీరు అత్యుత్తమ ఆటను ఆడి ఐదు దశాబ్దాల నిరీక్షణకు తెరదించండి' అని సూచించాడు.



## సౌత్‌జోన్ సారథిగా తిలక్

సౌత్‌జోన్ సారథిగా తిలక్ ఈనెల 23 నుంచి మొదలుకానున్న దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్‌కు హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ సారథిగా వ్యవహరించనున్నాడు. 15 మందితో కూడిన ఈ జట్టుకు ఆంధ్రా ఆటగాడు రికీ భుయ్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈనెల 23 నుంచి మొదలుకానున్న దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్‌కు హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ సారథిగా వ్యవహరించనున్నాడు. 15 మందితో కూడిన ఈ జట్టుకు ఆంధ్రా ఆటగాడు రికీ భుయ్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. హైదరాబాద్ నుంచి హిమతేజ, తనయ్ త్యాగరాజన్ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు.



## నాకు 5 వేలు, 10 వేల రూపాయలతో బ్రతకడం కూడా తెలుసు..: యాంకర్ సౌమ్య రావు

జబర్దస్త్ ద్వారా కేవలం నటులు మాత్రమే కాదు యాంకర్స్ కూడా మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. అనసూయ, రష్మీ గౌతమ్ లాంటి వారు మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కామెడీ షో ద్వారానే.. అలాగే ఆ మధ్య జబర్దస్త్ ద్వారా యాంకర్ గా మారింది ఓ ముద్దగుమ్మ ఆమె సౌమ్య రావు. సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సౌమ్య రావు. ఇక జబర్దస్త్ ద్వారా ఈ అమ్మడు మంచి గుర్తింపు తెచ్చుకుంది. యాంకర్ గా చేసింది కొన్ని రోజులే కానీ తన మాటలతో , చలాకీ తనంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ఇక జబర్దస్త్ నుంచి బయటకు వచ్చిన తర్వాత పలు టీవీ షోల్లో పాల్గొంది. అలాగే కొన్ని ఇంటర్వ్యూల్లో ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ క్రమంలోనే ఓ ఇంటర్వ్యూలో ఆమె కొన్ని ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ఈ ఇంటర్వ్యూలో తన యూట్యూబ్ రెవెన్యూ, నెలవారీ ఖర్చులు, లైఫ్ స్టైల్ , ప్రేమ జీవితం గురించి పలు విషయాలను పంచుకుంది. ముందుగా, తన సోషల్ మీడియా వాడకం గురించి మాట్లాడుతూ..ఇన్‌స్టాగ్రామ్‌లో తాను మంచి మేకప్ వేసుకున్నా, మంచి డ్రెస్ వేసుకున్నా అవుట్‌ఫిట్ చూపించడానికి మాత్రమే పెడతానని, కానీ కొంతమంది తినే ఫుడ్ నుంచి ఇంట్లోకి వచ్చిన కాక్రోచ్ వరకు మొత్తం షేర్ చేస్తుంటారు అని తెలిపింది. అలాగే తన యూట్యూబ్ ఛానెల్ గురించి మాట్లాడుతూ.. గతంలో డబ్బులు బాగానే వచ్చాయని, కానీ ప్రస్తుతం ఛానెల్ యాక్టివ్‌గా లేనందున ఎలాంటి రెవెన్యూ రావడం లేదని తెలిపింది.

## ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే

నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ 'ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది.







## ఈశాన్య రాష్ట్రాల్లేకుండా భారత చిత్రపటం.. గ్లాస్గోలో రెస్టారెంట్ తీరుపై లవ్లీనా అసంతృప్తి

కామన్వెల్త్ క్రీడలు జరుగుతున్న స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గోలో గల భారత సంతతి రెస్టారెంట్ ఒకటి దేశ చిత్రపటాన్ని తప్పుగా ముద్రించి విమర్శల పాలైంది. ఈశాన్య రాష్ట్రాల్లేకుండానే పటాన్ని అంసపూర్తిగా ముద్రించడం వివాదాస్పదమైంది. వివరాల్లోకెళ్తే.. ఈ క్రీడల్లో ఏకంగా ఏడు స్వర్ణాలతో సత్తాచాటిన భారత బాక్సింగ్ బృందం తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు గాను స్థానికంగా ఉన్న 'మిస్టర్ సింగ్స్ ఇండియా ది హోమ్ ఆఫ్ కర్రీ' అనే రెస్టారెంట్‌కు వెళ్లింది. అక్కడ నిర్వాహకులు బాక్సర్లకు భారత చిత్రపటం ఉన్న న్యాప్‌కిన్‌లు ఇచ్చారు. అయితే వాటిపై ఈశాన్య రాష్ట్రాలు లేవని గుర్తించిన లవ్లీనా బోర్గోహెయిన్ నిర్వాహకులను ఉద్దేశిస్తూ.. 'మీరు దీనిని తప్పుగా అనుకోకండి. ఈ మ్యాప్‌లో నార్త్ ఈస్ట్ మిస్ అయింది. హోటల్ ముందు బోర్డులోనూ ఇలాగే ఉంది. ఒక నార్త్ ఈస్ట్‌గా నాకు ఇది చాలా బాధ కలిగించింది. భారత్‌లో ప్రతి ప్రాంతం ముఖ్యమైనదే. మళ్లీ ఇలా జరుగకుండా చూసుకోండి' అని తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. అక్కడే ఉన్న బాక్సింగ్ కోచ్ అజయ్ సింగ్ సైతం.. నార్త్ ఈస్ట్ మాత్రమే కాదు, అందులో జమ్మూకాశ్మీర్‌నూ తప్పుగా ముద్రించారని అన్నాడు. కాగా దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో హోటల్ నిర్వాహకులు తమ తప్పును సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చినట్టు అజయ్ సింగ్ తెలిపారు.

## 18 ఏండ్ల నిరీక్షణకు తెర తన్విదే తైపీ టైటిల్



18 ఏండ్ల నిరీక్షణకు తెర తన్విదే తైపీ టైటిల్ భారత యువ బ్యాడ్మింటన్ సంచలనం తన్వి శర్మ తైపీ ఓపెన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. తైవాన్‌లో జరిగిన తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్‌లో తన్వి.. 21-16, 21-16తో ఆరో సీడ్ లిన్ ఎన్‌గుయెన్ (వియత్నాం)ను వరుస సెట్లలో చిత్తుచేసి తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. భారత యువ బ్యాడ్మింటన్ సంచలనం తన్వి శర్మ తైపీ ఓపెన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. తైవాన్‌లో జరిగిన తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్‌లో తన్వి.. 21-16, 21-16తో ఆరో సీడ్ లిన్ ఎన్‌గుయెన్ (వియత్నాం)ను వరుస సెట్లలో చిత్తుచేసి తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గతంలో యూఎస్ ఓపెన్ 300 టోర్నీలో ఫైనల్ చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకున్న తన్వి.. ఈసారి మాత్రం పట్టు వీడకుండా ఆడి 36 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేసింది. తాజా విజయంతో టోర్నీలో ఈ పంజాబ్ అమ్మాయి భారత 18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 2008లో హైదరాబాదీ షట్లర్ సైనా నెహ్వాల్ తర్వాత ఈ టోర్నీలో టైటిల్ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా గుర్తింపు సాధించింది. అంతేగాక అత్యంత పిన్న వయసు (17 ఏండ్ల 222 రోజులు)లోనే తైపీ ఓపెన్ గెలిచిన షట్లర్‌గానూ రికార్డులకెక్కింది. 2006లో కొరియా ప్లేయర్ లీ యాంగ్ డె 17 ఏండ్ల 287 రోజులకు సింగిల్స్‌లో విజేతగా నిలువగా తన్వి ఆ రికార్డును బ్రేక్ చేసింది.

### ఏకపక్ష విజయం

తనకంటే మెరుగైన ర్యాంకు కల్గిన ప్రత్యర్థులను చిత్తుచేస్తూ ఫైనల్ చేరిన తన్వి.. టైటిల్ పోరులోనూ అదే జోరు కొనసాగించింది. ప్రత్యర్థిని నెట్ దగ్గరికి తీసుకొచ్చి బోల్తా కొట్టిస్తూ ఆరంభంలోనే 4-1 ఆధిక్యం సాధించిన ఆమె ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవ్వాలిన అవసరమే రాలేదు. అద్భుతమైన క్రాస్ కోర్ట్ స్మాష్‌లకు తోడు డ్రాప్ షాట్లతో ఆధిక్యాన్ని 10-2కు పెంచుకుంది. ఆ తర్వాత కాస్త తడబడటంతో వియత్నాం అమ్మాయి పుంజుకునే యత్నం చేసింది. కానీ వెంటనే తేరుకున్న తన్వి.. వరుసగా ఐదు గేమ్ పాయింట్లతో తొలి గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్ ప్రారంభంలోనే ఎన్‌గుయెన్ 3-0తో ఆధిక్యంలోకి వెళ్లినా భారత షట్లర్ క్రమంగా పుంజుకుంటూ స్కోర్లను సమం చేసి 8-7తో ఆధిక్యంలోకి వచ్చింది. ఈ సమయంలో తన్వి.. రెండు అద్భుతమైన విన్నర్లతో విరామ సమయానికి 11-8తో ఆధిక్యత సాధించింది. నెమ్మదిగా ఆధిక్యాన్ని పెంచుకుంటూ వెళ్లిన భారత అమ్మాయి.. రెండో గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది. కాగా తనకు బంగారు పతకం దక్కిన అనంతరం ఆమె.. దానిని తీసుకెళ్లి పక్కనే ఉన్న కోచ్ పార్క్ టె సాంగ్ మెడలో వేసి గురుభక్తిని చాటి అందరి మనసులు గెలుచుకోవడం కొసమెరుపు.



## బుమ్రా ఔట్.. లంకతో సిరీస్‌కు స్టార్ పేసర్ దూరం నబీకి చాన్స్!

త్వరలో శ్రీలంక పర్యటనకు వెళ్లనున్న భారత జట్టుకు బ్యాడ్ న్యూస్. మోకాలి గాయంతో ఇబ్బందిపడుతున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. మోకాలి గాయంలో వాపు ఇంకా తగ్గలేదని, ఇప్పుడు గనుక అతడిని ఆడిస్తే అది మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని సీవోఈలోని స్పోర్ట్స్ సైన్స్ టీమ్ సూచించిన నేపథ్యంలో బుమ్రా లంకతో సిరీస్ నుంచి వైదొలిగాడు.

బుమ్రా స్థానాన్ని జమ్మూకాశ్మీర్ పేసర్ అకిబ్ నబీ భర్తీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనిపై బీసీసీఐ అధికారిక ప్రకటనేమీ చేయకపోయినా బోర్డు ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'బుమ్రా ఫిట్‌గా లేడు. అతడి స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడిగా నబీకి ఆమోదముద్ర పడింది' అని తెలిపాడు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, RNI Reg no. APTEL/2001/5268 printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020